4

# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం । 30 సెప్టెంబర్ 2025 । ■ 16 పేజీలు




## రాజారంలో సర్పంచ్ ఎన్నికలు లేనట్టే...?

■ ఎస్సీ జనాభా లేని గ్రామంలో కేటాయింపు ■ 2019, 2025లో ఎస్సీకి రిజర్వ్ ■ ఈసారి ఎన్నికలు లేనట్లే




# మోగింది నగారా

■ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల
■ మొత్తం ఐదు విడుతల్లో నిర్వహణ
■ 2 విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
■ తర్వాత 3విడతల్లో పంచాయతీ ఎన్నికలు
■ అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల
■ అదే రోజు నుంచి నామినేషన్లు షురూ..
■ అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
■ పల్లెల్లో మొదలైన ఎన్నికల సందడి..
■ మహిళలు, యువతను ఆకర్షించేందుకు ఎత్తుకు పైఎత్తులు మొదులు

వివరాలు 15లో

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

స్థానిక సంస్థలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. పండుగ వేళ ఎన్నిక షెడ్యూల్ రావడంతో ఏర్పాట్లలో అధికారులు తలమునకలవుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను రెండు విడతల్లో, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పాలనపై పట్టు సాధించేందుకు కొంత సమయం పట్టింది. గ్రామ పంచాయతీల పాలన గత సంవత్సరం జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీకాలం జూలైతో ముగిసింది. ఏడాది సుధీర్ఘ సమయం దాటిన తరువాత ఎట్టకేలకు మార్గం సుగమం కావడంతో పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది. మరో వైపు ఎన్నికల్లో సత్తా చాటుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తుండగా, దీటుగా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు సిద్ధమవుతున్నారు. కీలకమైన జెడ్పీటీసీ పీఠాలను దక్కించుకునేందుకు ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు దృష్టిసారిస్తున్నారు. షెడ్యూల్ ప్రకటనతో గ్రామాల్లో ఎన్నికల పండుగ మొదలైంది.



### సందడే.. సందడి..!

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల పండుగ మొదలైంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమైన ఆశావహులు, రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన గ్రామాల్లో ఇప్పటికే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. దసరా, దీపావళి పండుగలను దృష్టిలో ఉంచుకొని మహిళలు, యువతను ఆకర్షించేందుకు ఎత్తులు వేస్తున్నారు. దసరా పండుగ గాంధీ జయంతి రోజు వస్తుండడంతో ఒక్క రోజు ముందు లేదా మరుసటి రోజు మద్యం, మాంసం పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.



## పూల సంబరం..
# పుడమి శోభితం

■ అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు
■ ఆడిపాడిన మహిళలు
■ మురిసిన నింగీనేల
■ నేడు మరికొన్ని చోట్ల..

నేలంతా పూల సింగిడైంది. వాడలన్నీ బతుకమ్మల బారులు తీరాయి. ఊళ్లన్నీ కొత్త కళను సంతరించుకున్నాయి. ఆడబిడ్డ చేతులు తాకి పూలన్నీ పులకించగా, తీరొక్క పూలతో ముస్తాబైన బతుకమ్మలు సోమవారం మధ్యాహ్ననికే దేవుడి గదిలో కొలువు దీరాయి. "ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మా అంటూ లయబద్ధంగా కోలాటాలు ఆడారు. గౌరమ్మను గంగమ్మ చెంతకు చేర్చడంతో తొమ్మిది రోజుల పండుగ జరుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో మంగళవారం జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

## మహాగౌరిగా సరస్వతీ అమ్మవారు

■ అమ్మవారి సన్నిధిలో కలెక్టర్ దంపతుల పూజలు
■ 2123మంది చిన్నారులకు అక్షర శ్రీకారం
■ తగ్గిన భక్తుల సంఖ్య..

16



మహాగౌరి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న సరస్వతీ అమ్మవారు

## నమ్మించి.. నిలువునా ముంచి!

■ తమది కాని భూమి విక్రయానికి..
■ బాధితుల నుంచి 45లక్షలు వసూలు
■ రిజిస్ట్రేషన్‌కు రాకపోవడంతో బాధితులకు అనుమానం
■ నిలదీసే క్రమంలో ఊడాయింపు
■ గ్రామస్తుల అదుపులో మధ్యవర్తి -4లో

## మహారాష్ట్రను తాకిన
# ఆదివాసీ ఉద్యమం

■ పండర్ కౌడ పట్టణంలో ఆదివాసీల భారీ ర్యాలీ
■ లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ఆదివాసీల డిమాండ్..

16



లంబాడాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఆదివాసీల ఉద్యమం మహారాష్ట్రను తాకింది. సోమవారం మహారాష్ట్రలోని పండర్‌కౌడ పట్టణంలో ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ, తెలంగాణ రాజగోండ్ సేవాసమితి అధ్యక్షుడు సోయం బాపూరావు ర్యాలీలో పాల్గొన్నారు. మహారాష్ట్రలో బీసీలుగా చెలామణి అవుతున్న లంబాబాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ఆదివాసీలు డిమాండ్ చేశారు.

# ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

■ కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వచ్చినందున నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు, బందోబస్తు, అధికారులు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, రక్షణ ఏర్పాట్లు ఇతర ఎన్నికల అంశాలకు సంబంధించి అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే ప్రచార అంశాలను వెంటనే తొలగించాలని, మీడియాలో వచ్చే ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జెడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి. ఎన్నికలు ప్రతి జిల్లాలో రెండు విడతలలో నిర్వహించడం జరుగుతుందని, సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు ఎంపిక చేయబడిన జిల్లాలలో మూడు విడతలుగా, మిగతా జిల్లాలలో రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నోటీసు జారీ, ఓటర్ల జాబితా ప్రదర్శన, నామినేషన్ల దాఖలు, పరిశీలన, చెల్లుబాటయ్యే నామినేటెడ్ అభ్యర్థుల జాబితా, అప్పీలు, అప్పీళ్ల పరిష్కరణ, అభ్యర్థిత్వం ఉపసంహరణ, పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ, పోలింగ్ నిర్వహణ, రీపోల్ ఉన్నట్లయితే సంబంధిత ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు, ప్రకటన ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర అదనపు డి.జి.పి. మహేష్ భగవత్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి చర్యలకు తావు లేకుండా బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత, సి. సి. టివి పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల



అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన విడుదలైనందున రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అక్టోబర్ 23వ తేదీన నిర్వహించు మొదటి విడత ఎన్నికలలో 9 జెడ్.పి.టి.సి., 62 ఎం.పి.టి.సి. స్థానాలకు, అక్టోబర్ 27వ తేదీన నిర్వహించు రెండవ విడత ఎన్నికలలో 7 జెడ్.పి.టి.సి., 67 ఎం.పి.టి.సి. స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సర్పంచ్, వార్డు సభ్యులకు జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో 7 మండలాలలో 114 సర్పంచ్, 996 వార్డు మెంబర్లకు, రెండవ విడతలో 5 మండలాలలో 102 సర్పంచ్, 868 వార్డు సభ్యులకు, మూడవ విడతలో 4 మండలాలలో 90 సర్పంచ్, 816 వార్డు మెంబర్లకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొత్తంగా జిల్లాలోని 306 గ్రామపంచాయతీలలో 2 వేల 680 వార్డులు, 306 గ్రామాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని, మరొకసారి శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో వివిధ విభాగాలకు సంబంధించిన నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పోలీసు శాఖ అధికారులు సరిపడా అందుబాటులో ఉన్నారని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎందరో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన గురువు మెస్రం మనోహర్



ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

**ఉట్నూర్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, ప్రత్యేక అధికారిగా అనేక స్థాయిలలో విధులు నిర్వహించి విద్యార్థులను తీర్చి దిద్దిన గురువు మెస్రం మనోహర్ అని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం పదవి విరమణ పొందిన మనోహర్ దంపతులను అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కుడ్మెత మనోహర్ తో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని అన్నారు. మనోహర్స మగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో పాఠశాల ఉపాధ్యాయునిగా నియుక్తులై 38 సంవత్సరాలుగా ఎందరో మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి, వివిధ హోదాలతో పని చేస్తూ డి.ఈ.ఓ. ఏజెన్సీ ఇన్చార్జిగా, ప్రాథమిక విద్య ప్రత్యేక అధికారిగా, డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా, పి.ఈ.టి. ప్రిన్సిపాల్ గా, బి.ఈ.డి. కళాశాల అధ్యాపకుడిగా, ఎ.పి.ఓ. పి.వి.టి.జి., ప్రిన్సిపల్ గా విధులు నిర్వహిస్తూ సామాజిక సేవలలో పాల్గొంటూ ఉట్నూర్ సాహిత్య వేదిక ఏర్పాటు చేసి ఏజెన్సీ ప్రాంతం నుండి దాదాపు 50 మంది రచయితలను కవులను తయారు చేశారని తెలిపారు. విద్యకు సంబంధించిన అనేక రాష్ట్ర, అంతరాష్ట్ర సెమినార్లలో పాల్గొని గిరిజన విద్య గిరిజన సంస్కృతి తెలిపి విధులు నిర్వహిస్తూనే రచనలు చేశారని , గోండి సంస్కృతి, ఇప్పపూలు, పెసలాపూర్, నాగోబా జాతర చరిత్ర, పరదాన్ గిరిజనుల సంస్కృతి సాహిత్యం అనే పుస్తకాలు రాశారని, విధులు నిర్వహిస్తూనే విద్యను కొనసాగించి ఎం.ఎ. రాజనీతి శాస్త్రం, ఎం.ఎ. ఆంగ్లం, ఎం.ఈ.డి. పి.హెచ్.డి. వరకు చదువుకున్నారని తెలిపారు. మనోహర్ అందించిన సేవలు మరువలేనివని, సమాజం ఎప్పుడు గుర్తుంచుకుంటుందని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులకు కలిసి సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఓ. దామోదర స్వామి, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి, రిటైర్డ్ ఈ.ఈ. భీమ్ రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## స్వస్థ్ నారి - సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం

**ఉట్నూర్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
స్వస్థ్ నారి - సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగిందని అదనపు వైద్యాధికారి కుడిమేత మనోహర్ తెలిపారు. సోమవారం జిల్లాలోని హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళల సంక్షేమంలో భాగంగా ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు వైద్యాధికారి మాట్లాడుతూ మహిళల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరంలో రిమ్స్ నుండి వచ్చిన చర్మవ్యాధి నిపుణులు, దంత వైద్య నిపుణులు, గర్భిణీ స్త్రీలు- స్త్రీ సంబంధిత వ్యాధి నిపుణులతో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 32 మంది దంత సమస్య, 38 మంది చర్మ సమస్య, 28 మంది గర్భిణులు - స్త్రీ సంబంధిత సమస్యల మహిళలు వైద్య సేవలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

## సరస్వతి క్షేత్రంలో ఎస్పీ ప్రత్యేక పూజలు

**ముథోల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
శ్రీ సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం అయిన మూల నక్షత్రం రోజు సోమవారం బాసరలో ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న సరస్వతి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు, వేదపండితులు ఎస్పీకి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## పూజలందుకుంటున్న కర్ర దుర్గమ్మ..!

**కుభీర్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మండలంలోని సిరిపెల్లి (హెచ్) గ్రామంలో ప్రతిష్టించిన కర్ర దుర్గమ్మ తల్లి దశాబ్ద కాలంగా పూజలందుకుంటున్నది. ఈ గ్రామం మహారాష్ట్ర సరి హద్దులో ఉంది. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం నుంచి గ్రామంలో ఇంటింటా ఉపవాస దీక్షలు చేస్తారు. పర్యావరణహితమైన కర్ర దుర్గమ్మ తల్లిని ప్రతిష్టాపించినప్పటి నుంచి సుఖసంతోషాలతో ఉంటున్నామని గ్రామస్తుల నమ్మకము. గ్రామస్తులు, యువకులు మాలాధారణ చేసి నియమ నిష్టలతో ఉంటారు. ప్రతిరోజు భజనలు సంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.



# బీసీ ఫెడరేషన్‌కి పాలకమండలి ఏర్పాటు చేయాలి

**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
బీసీ ఫెడరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు బహిరంగంగా లేఖ రాశామని తెలిపారు. బీసీల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించేందుకు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి తరపున విన్నవించామని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చట్టం తీసుకురావాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని చెప్పారు. జనాభా ఆధారిత ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించి కాంట్రాక్ట్ పారిశ్రామిక రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని వారు కోరారు. కొత్తగా ఏర్పాటు చేయబడిన కార్పొరేషనులకు చట్టబద్ధత కల్పిస్తూ ఒక్కొక్క కార్పొరేషన్‌కు రూ.రెండు వేల కోట్ల నిధులను మంజూరు చేయాలన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఏబీసీడీ గుంపులుగా



వర్గీకరించకూడదన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించి రూ. 5 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదన తీసుకురావాలని సూచించారు. సంచారకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో అనేకంగా ఏర్పడిన సంఘాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా విధివిధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కర్రే లచ్చన్న, బీసీ పోరాట సమితి నాయకులు షాకాపూరి భీమ్సేన్, గజెల్లి వెంకన్న, వేముల అశోక్, అంజయ్య, రాజేశం పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని 17వ వార్డు అశోక్ రోడ్ కు చెందిన పాదం శ్రీలత, పూదరి శ్రీనివాస్ భార్యాభర్తల తాము ఇద్దరము దివ్యాంగులమని, గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ప్లాస్టరింగ్ దశలో ఉందని, మున్సిపల్ జాబితాలో ఎల్ 1 లో ఉన్నామని, తమ పరిస్థితిని పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు వర్తింప చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాజీపేట మండలం మల్కేపల్లి గ్రామానికి చెందిన కసాడి శ్రీనివాస్ 1993 వరకు తమ గ్రామం ఎస్.సి. రిజర్వుడ్ సర్పంచ్‌గా పరిగణించబడిందని, 2001 లో కొందరి నిర్లక్ష్యం కారణంగా ఎస్.టి. రిజర్వుడ్‌గా మార్చబడిందని, ప్రస్తుత ఎన్నికల నిర్వహణలో రిజర్వేషన్ మార్చగలరని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన హరికిషన్ పాండే పట్టణంలోని యువ సంఘటన పాఠశాల సమీపంలో గల వాటర్ ట్యాంక్ శిథిలావస్థలో ఉందని, ఎలాంటి ప్రమాదం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రానికి చెందిన కె.శ్రీనివాస్ తాను కొనుగోలు చేసిన భూమిలోనికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్న వ్యక్తి అక్రమంగా చొరబడి నిర్మాణం చేపడుతున్నాడని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పిన్న సాయితేజ తాను సాదాబైనమా ద్వారా కొనుగోలు చేసిన భూమిని క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకోగా తిరస్కరించడం జరిగిందని, ఈ విషయమై దరఖాస్తును పునరుద్ధరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### ఊరిలో అంత గిరిజనులే

# ఆ గ్రామాలకు బీసీ రిజర్వేషన్

#### తలలు పట్టుకుంటున్న నాయకులు, గ్రామస్తులు

**మామడ, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొన్ని గ్రామాల్లో చిత్ర విచిత్రమైన రిజర్వేషన్లు వచ్చాయి. మండలంలోని వాస్తాపూర్, రాసి మెట్ల గ్రామాల్లో అందరూ గిరిజనులే ఉన్నారు. ఏం జరిగింది తెలియదు కానీ రెండు గ్రామాలకు బీసీ మహిళ రిజర్వేషన్ కేటాయించారు. అలాగే కిషన్ రావుపేట్ గ్రామంలో 830 జనాభాలో అంత గిరిజనులే ఉండగా, ఇందులో కేవలం నలుగురు మాత్రమే బీసీలు ఉన్నారు. ఈ గ్రామానికి బీసీ జనరల్ కేటాయించారు. లింగాపూర్ గ్రామంలో ఎస్టి, ఎస్సీలు ఉండగా బీసీ జనరల్ కేటాయించారు. సర్పంచ్ స్థానాలకు ఇలాంటి రిజర్వేషన్లు రావడంతో నాయకులు తలలు పట్టుకున్నారు. ఈ గ్రామాల్లో రిజర్వేషన్లు మార్పు చేస్తే సరే, మార్పు చేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

# డిప్యూటీ కలెక్టర్‌గా జాసిన్త్ జోల్ బాధ్యతల స్వీకరణ



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా జాసిన్త్ జోల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు





**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మూల నక్షత్రం పర్వదినం సందర్భంగా బాసర సరస్వతి అమ్మవారిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు దర్శించుకున్నారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో సోమవారం జరిగిన మూల నక్షత్రం ప్రత్యేక దర్శనానికి జిల్లా కలెక్టర్ దంపతులకు ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మూల నక్షత్రం పర్వదినం సందర్భంగా వేలాది మంది భక్తులు బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి రానున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా ఆలయ ప్రాంగణంలో పరిశీలించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.



# గోదావరికి మళ్లీ వరద ఉధృతి

#### నీటమునిగిన పుష్కరఘాట్‌లు
#### పుణ్యస్నానాలకు భక్తులకు తప్పని తిప్పలు
#### భక్తుల భద్రత దృష్ట్యా అనుమతించని పోలీసులు

**ముథోల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో పుష్కరఘాట్‌లు నీటమునిగాయి. దీంతో బాసరకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలకు ఇబ్బంది పడుతున్నారు. మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురియడంతో వరద నీటి ప్రవాహం పెరగడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గోదావరి వద్ద పుష్కరఘాట్‌లను ఆనుకొని వరద నీరు ప్రవహిస్తుంది. సోమవారం అమ్మవారి మూల నక్షత్రం కావడంతో దేశ నలుమూలల నుండి భక్తులు తరలివచ్చారు. బాసరకు వచ్చే భక్తులు ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించిన అనంతరం బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో స్నాన ఘట్టాలు నీట మునిగటంతో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించలేకపోతున్నారు. స్నాన ఘట్టాల వద్ద వరద నీరు ప్రభావం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో పోలీసులు స్నాన ఘట్టాల వైపు భక్తులను రానివ్వడం లేదు. స్నాన ఘట్టాల వైపు వెళ్ళవద్దని భక్తులకు పోలీసులు సూచిస్తున్నారు.

### బతుకమ్మ పండగను

# సంబురం జరుపుకోవాలి

**జన్నారం, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై గొల్లపల్లి అనుష కోరారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ మూడు రోజుల పాటు నిర్వహించే అవకాశం ఉందన్నారు. స్థానిక ప్రాధాన్యతను బట్టి ప్రజలు సద్దుల బతుకమ్మ నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.




# దుర్గాదేవి నిమజ్జనానికి అన్ని ఏర్పాటులను పూర్తి చేయాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
దుర్గాదేవి నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేసే వినాయక సాగర్ చెరువు (బంగల్పేట్ చెరువు) ను కలెక్టర్ పరిశీలించారు. చెరువుగట్టు వెంబడి రక్షణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని చెప్పారు. మెరుగైన లైటింగ్ తో పాటు, క్రేన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఎవరు చెరువులోకి దిగకుండా ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిమజ్జనం కార్యక్రమం పూర్తయిన వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. అంతకుముందు కలెక్టర్, బంగల్పేట్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు పూజారులు ఘన స్వాగతం పలికారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ కు అమ్మవారి ఫోటోను బహూకరించారు. పూజారులు ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. దసరా పర్వదినం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# నమ్మించి.. నిలువునా ముంచి!

**తమది కాని భూమిని అమ్మకానికి పెట్టిన ఘనులు - బాధితుల నుంచి రూ. 45 లక్షలు వసూలు**
**రిజిస్ట్రేషన్‌కు రాకపోవడంతో బాధితులకు అనుమానం - నిలదీసే క్రమంలో ఊడాయింపు**
**గ్రామస్తుల అదుపులో రెండు రోజులుగా మధ్యవర్తి**




**బెల్లంపల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మాయ మాటలతో బురిడీ కొట్టించి భూమి అమ్మకం పేరిట అత్యంత నిరుపేదలను నిలువునా ముంచి వారి నుంచి రూ. 45 లక్షలు దండుకొని ఐదుగురు సభ్యులతో కూడిన ముఠా ఊడాయించిన ఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి వెలుగు చూడడం చర్చనీయాంశంగా మారింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అచ్చులాపూర్ శివారులో 340/1, 341/బీ సర్వే నెంబర్లలో 17.26 ఎకరాల భూమి ఖమ్మం జిల్లా అశ్వరావుపేటకు చెందిన తాతారావు, శ్రీనివాస రావుల పేరిట చలామణిలో ఉంది. ఈ భూమిని తాము భూ యాజమానుల నుంచి కొనుగోలు చేసినట్లు బెల్లంపల్లి ప్రాంతానికి చెందిన రామ్ టెంకి హరికృష్ణ (బట్వాన్ పల్లి), రామ్ టెంకి శివ (బట్వాన్ పల్లి), బొలిశెట్టి భీమయ్య (పాత మంచిర్యాల), మొండి (భీమిని, రాంపూర్), లగిశెట్టి సత్యనారాయణ (బుధకుర్దు)లు ఫేక్ అగ్రిమెంట్ పత్రాలు సృష్టించి వాటితో పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలోని దుబ్బపల్లి గ్రామానికి చెందిన బలాని గంగరాజు, పూజారి సమ్మయ్య, పూజారి నాగేష్, దాసరి శ్యామ్, దాసరి గోపి, పోల రాములులకు 12 ఎకరాలు అమ్మజూపారు. సంచార జీవనం సాగిస్తూ రోడ్లపై బుగ్గలు, తల వెంట్రుకలు అమ్ముకుని ఉపాధి పొందుతున్న ఈ ఆరుగురు బాధిత వడ్డెర కుటుంబాల నుంచి కేటుగాళ్లు రూ.45 లక్షలు ముందస్తుగానే వసూలు చేసుకొని ఉడాయించారు. రెండు నెలలుగా కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌కు ఈ కేటుగాళ్లు రాకపోవడంతో అనుమానించి వచ్చి విచారించి తాము మోసపోయినట్లు బాధితులు గుర్తించారు.

**నకిలీ డాక్యుమెంట్లతో డబ్బులు వసూలు చేసిన కేటుగాళ్లు...**
భూ యాజమానుల నుంచి భూమిని కొనుగోలు చేసినట్లు సృష్టించిన ఫేక్ డాక్యుమెంట్లు చూపించి తమ వద్ద నుంచి డబ్బులను దండుకున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఈ కేటుగాళ్ల ముఠాలో ఒకరైన బొలిశెట్టి భీమయ్య (పాత మంచిర్యాల)ను పట్టుకొని విచారించగా.. తాండూరు మండలం అచ్చులాపూర్ శివారులోని మరొకరి భూమిని చూపి సదరు వ్యక్తులు మరికొంత మంది వ్యక్తుల నుంచి రూ. కోటిన్నరకు పైగా డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. దుబ్బపల్లి గ్రామస్తులంతా తరలివచ్చి బాధిత కుటుంబాలకు అండగా బెల్లంపల్లి మండలంలోని బట్వాన్ పల్లి గ్రామంలో రెండు రోజులుగా శాంతియుత నిరసన పాటిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని రామ్‌టెంకి హరికృష్ణ, రామ్ టెంకి శివ ఇంటి ఎదుట బాధితులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. తమ డబ్బులు పూర్తిగా చెల్లించే వరకు గ్రామంలో నిరసన తెలుపుతామన్నారు. పోలీసులు తమకు సహకరించాలని, తమని వెళ్ళగొట్టే ప్రయత్నం చేస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని వెల్లడించారు. పంది మాంసంతో వంట చేసుకుని వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు. మొదటగా రూ. 5 లక్షలు అందిస్తామని మధ్యవర్తులు చెప్పినప్పటికీ బాధితులు అంగీకరించలేదు.

**గతంలోనూ ఇదే తరహా మోసం...**
వడ్డెర కులస్తులకు భూమిని అమ్మ జూపి డబ్బులతో ఉడాయించిన బట్వాన్ పల్లికి చెందిన రామ్ టెంకి హరికృష్ణ, రామ్ టెంకి శివ లు గతంలోనూ ఇదే తరహా మోసానికి తెర తీసి పోలీసులకు చిక్కారు. నకిలీ పత్రాలు సృష్టించి రైతులకు దక్కాల్సిన కౌలు రుణాలను అనర్హులకు కట్టబెట్టారు. 28 మంది కౌలు రైతుల పేరిట నకిలీ పత్రాలు సృష్టించి రూ 8.20 లక్షలు స్వాహ చేశారు. 2015-2018లో జరిగిన ఈ వ్యవహారంలో బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన సింగతి భీమయ్య అనే కౌలు రైతు తన పేరిట మరొకరు రుణం పొందారని తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. రైతులకు దక్కాల్సిన కౌలు రుణాలు పక్కదారి పట్టించడంలో కీలకంగా వ్యవహరించిన రామ్ టెంకి హరికృష్ణ, రామ్‌టెంకి శివ, బెల్లంపల్లి అప్పటి ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ కొండమడుగు మురళీధర్, వీఆర్వో ఎలమద్రి శాంతయ్య, డిప్యూటీ తహసిల్దార్ వరంభట్ల సుధాకర్‌లతోపాటు ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న 11 మంది వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ఇద్దరు మహిళ వ్యవసాయ అధికారులపై పోలీసులు కేసులు నమోదు చేయడం గమనార్హం.

# సాగుకు అవసరం మేరకు యూరియా తీసుకోవాలి





**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, రైతులు అవసరం మేరకు తీసుకొని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డిసిపి భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి మండల వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా పంపిణీ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూరియాను సక్రమంగా వినియోగించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, అవసరం మేరకు తీసుకునేలా వివరించాలని తెలిపారు. రైతులకు అందిస్తున్న యూరియా సంబంధిత వివరాలతో రిజిస్టర్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఈ-పాస్ యంత్రాలలో ఎలాంటి విభేదాలు రాకుండా చర్యలు తీసుకోవాలని, పంట సాగు సక్రమంగా జరిగేలా రైతులకు సహకరించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా మండలాల వారీగా కేటాయించిన నిల్వలలో 50 శాతం యూరియా అందించడం జరుగుతుందని, 49 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ చేయబడి ఉందని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హత గల ప్రతి రైతుకు పంట సాగుకు అవసరమైన యూరియా అందించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## ముమ్మర తనిఖీలు చేపట్టాలి

**ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతీ ఒక్కరు కృతనిశ్చయంతో 24 గంటలు అప్రమత్తతతో విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రలజను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం ఇతర సామగ్రి జిల్లాలోకి ప్రవేశించకుండా చెక్ పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడంలో కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ వాహిదుద్దీన్, విష్ణుమూర్తి, సీఐ రాణాప్రతాప్, శ్రీధర్, తదతరులు పాల్గొన్నారు.

## గసద్దుమణిగిన రావణవద వివాదం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
గత కొంతకాలంగా బెల్లంపల్లిలో రావణాసుర వదపై జరుగుతున్న వివాదం ఎమ్మెల్యే గడ్డం వినోద్ జోక్యంతో సోమవారం సద్దుమణిగింది. ఎమ్మెల్యే వినోద్ దళిత సంఘాల నాయకులను, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులను పిలిపించి మాట్లాడారు. బెల్లంపల్లిలో శాంతి భద్రతల సమస్యలు ఎత్తకుండా ప్రజల అభిప్రాయం మేరకు రావణాసుర వదలను అడ్డుకోవద్దని ఎమ్మెల్యే సూచించారు. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా సోదర భావంతో రావణాసుర వద కార్యక్రమాన్ని జరుపుకునేలా ఇరువర్గాల నాయకులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, చిప్ప మనోహర్, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు నగేష్, బాల సంతోష్, దళిత సంఘాల నాయకులు కుంభాల రాజేష్, చిలుక రాజనర్సు, శేఖర్, గోమాస రాజం ఉన్నారు.



## రాజారంలో సర్పంచ్ ఎన్నికలు లేనట్టే...?



**వేమనపల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని రాజారం గ్రామ పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన వేళ రాజారం గ్రామపంచాయతీలో సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలపై సందిగ్ధం నెలకొంది. గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన గ్రామపంచాయతీగా రాజారం 2018లో ఏర్పాటు చేసింది. గతంలో రాజారం గ్రామం ధస్నాపూర్ గ్రామపంచాయతీలో ఉండేది. 2018 లో వేమనపల్లి మండలంలో 14 గ్రామపంచాయతీలు ఉండగా వాటిలో 13 గ్రామపంచాయతీలలో సర్పంచ్ ఎన్నికలు జరిగినప్పటికీ ఒక రాజారం గ్రామపంచాయతీలో అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా 2018లో తప్పుడు రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆ గ్రామపంచాయతీకి సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు దూరమయింది. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఆ గ్రామం నుండి ఒక ఎస్సి ఓటరు కూడా లేకపోవడంతో సర్పంచ్, మూడు ఎస్సీ వార్డు మెంబర్లకు గాను ఎవరు నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో మరో మూడు జనరల్ వార్డుల కూడా నామినేషన్లు రాకపోవడంతో అక్కడ ఎన్నికలను నిర్వహించలేదు. అప్పటినుండి నేటి వరకు పరిపాలన అంతా ప్రత్యేక అధికారుల చేతుల్లోనే గ్రామ పాలన కొనసాగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా 2018లో ప్రకటించిన రిజర్వేషన్లలో భాగంగా రాజారం గ్రామ పంచాయతీని సర్పంచ్ స్థానం ఎస్సీ రిజర్వేషన్ కేటాయించడంతో ఆ గ్రామ పంచాయతీ పరిధిలో ఒక్క ఎస్సి ఓటర్ కూడా లేకపోవడం జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాల్సిన అధికారులే ఒక్కరు కూడా ఎస్సీ జనాభా లేని గ్రామపంచాయతీని సర్పంచ్ స్థానం, ఎస్సీకి కేటాయించి మూడు వార్డులను ఎస్సికి, మూడు వార్డులను జనరల్ అభ్యర్థులకు, కేటాయించడంతో అక్కడి ప్రజలు తమ గ్రామ పంచాయతీకి అధికారుల నిర్లక్ష్యంతోనే తప్పుడు రిజర్వేషన్లు కేటాయించిన ఫలితంగా ఆ గ్రామంలో సర్పంచ్, వార్డ్ మెంబర్ల ఎన్నికలు జరగలేదు. ప్రస్తుతం రాజారంలో సుమారు 400 కు పైగా జనాభా కలిగి ఉండి, దాదాపు 266 ఓటర్లుగా వారిలో ఎస్టీ ఓటర్లు 184, బిసి ఓటర్లు 76, ఓసి ఓటర్లు 6 మంది ఉన్నారు. ఓటర్ల నమోదు ఈ విధంగా ఉంటే ఆ గ్రామ పంచాయతీలో, 6 వార్డు మెంబర్లు, ఒక సర్పంచ్ స్థానం కలిగి ఉన్నప్పటికీ గతంలో అధికారులు చేసిన పొరపాటుకు అక్కడి ప్రజలు సర్పంచ్, వార్డు మెంబర్ల పాలనకు దూరమయ్యారు. ఈసారైనా స్థానిక సంస్థలలో సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయని ఆశపడిన ప్రజలకు మరో మారు ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్లలో ఎస్సీ మహిళా రిజర్వేషన్ కేటాయించడంతో అధికారులు రాజారం గ్రామపంచాయతీకి గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతమయ్యాయి. సర్పంచ్ ఎన్నికలు జరగకపోవడానికి అధికారుల వైఖరి కారణమంటున్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా సోమవారం తీరొక్క పూలతో ఉత్సవాలకు మహిళలు రంగురంగుల బతుకమ్మలను సిద్ధం చేశారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి, టేకు పూలు, కట్ల పూలు, సీతమ్మ జడ పూలు, తామెర పూలతో పాటు ప్రకృతిలో సహజంగా లభించే అన్ని రకాల పూలతో బతుకమ్మలను అందంగా ముస్తాబు చేశారు. తెలంగాణలో మహిళల ఆత్మగౌరవ ప్రతీకగా భావించే పండుగను గొప్పగా నిర్వహించేందుకు ప్రతి ఇంట్లో మహిళలు సంసిద్ధమయ్యారు. బెల్లంపల్లి కార్మిక కాలనీలతో పాటు పరిసర గ్రామాలలో కూడా సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు చేపట్టారు. పోచమ్మ చెరువు వద్ద బతుకమ్మల నిమజ్జనం కోసం మున్సిపల్ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.



## బట్వాన్‌పల్లిలో భూ బాధితుల ఆందోళన

### పంది మాంసంతో వినూత్న నిరసన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలోని బట్వాన్ పల్లి గ్రామంలో రామ్ టెంకి హరికృష్ణ, రామ్‌టెంకి శివల ఇంటిదట బాధిత వడ్డెర కులస్తులు సోమవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నకిలీ భూమి పత్రాలు చూపించి తమ నుండి రూ 45 లక్షలు దండుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు డబ్బులు చెల్లించే వరకు గ్రామంలోనే నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో పెద్ద ఎత్తున పాల్గొన్న బాధితులు గ్రామంలోని పంది మాంసాన్ని వండుకుని వినూత్నమైన రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం



**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచడానికి ఆమ్ ఆద్మీ పార్టీ స్వాగతిస్తుందని వచ్చే ఎన్నికల్లో బీసీలకు టికెట్లు కేటాయించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో పార్టీ తరఫున అభ్యర్థులను ఎంపిక చేసిన ధరలో ప్రకటిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు జిల్లా కమిటీ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వినోద్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శ్రీ మహా సరస్వతి అవతారంలో దుర్గమ్మ దర్శనం

**రెబ్బెన, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
కుమ్రం భీం జిల్లా రెబ్బన మండలం ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనకదుర్గాదేవి స్వయంభు మహాంకాళీ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఉత్సవాల 8వ రోజు అమ్మవారు, శ్రీ మహా సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలించ్చారు. మూల నక్షత్రం కావడంతో దేవస్థానంలో దేవార వినోద్ స్వామి ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం ఆలయ అధ్యక్షుడు మోడెమ్ తిరుపతి కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.



## నూతన జీపీని ప్రజా ఆమోదంతో నిర్ణయించాలి



**జైనూర్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
న్యాయం కోసం జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ ను ఆశ్రయించిన జైనూర్ మండలం పట్నాపూర్ (అందుగుడా) గ్రామస్తులు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఏవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేత. పట్నాపూర్, గోండుగూడా హాబిటేషన్‌లో నూతనంగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ శాఖ మంజూరు చేసింది. మెజార్టీ జనాభా ప్రతిపాదన గ్రామపంచాయతీ భవనాన్ని పట్నాపూర్ నడిబొడ్డున ఉన్న స్థలంలో నిర్మించాలని అలాగే శ్యామ్ నగర్ కాలనీకి రహదారి కొరకు సీసీ రోడ్డును మంజూరు చేయాలని గ్రామస్తులు సోమవారం జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్‌తో కలిసి జిల్లా కలెక్టర్‌ను ఏవో కు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్, అధికారులను గ్రామానికి పంపి రెండు గ్రామాల సమన్వయంతో అందరికీ న్యాయం జరిగేలా భవన నిర్మాణాన్ని చేపడుతామని హామీ ఇచ్చారు.

## అంగరంగ వైభావంగా సద్దుల బతుకమ్మ

**జన్నారం, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది . కార్యక్రమంలో మహిళలు బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తూ అందర్నీ అలరించారు. అందులో రామాలయం కాలనీ వాసులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు రామాలయం కాలనీలో సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎస్సై గొల్లపల్లి అనూష సందర్శించి మహిళలతో పాటు తాను నృత్యం చేశారు జన్నారం మండలంలో తనకు మొదటి బతుకమ్మ పండుగ అని అందరితో గడిపిన క్షణాలు మర్చిపోలేనివని ఆమె అన్నారు మహిళా ఎస్సై తమతో బతుకమ్మ ఆడడం తమకెంతో ఆనందాన్నిచ్చిందని మహిళలందరూ పొంగిపోయారు కార్యక్రమంలో ఎస్ఐ అనూష మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ పండగను అందరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని ఆమె సూచించారు.



## మద్యం దుకాణాలకు 7 దరఖాస్తులు



**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్ తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలకు సంబంధించి ఈరోజు ఏడు దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి రజాక్ తెలిపారు. ఈ దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 18 వ తేదీతో ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఒక్క దరఖాస్తులు మూడు లక్షల రూపాయల రుసుము ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన వేయడాని అవకాశం ఉందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలకు అక్టోబరు 23 న లక్కీ డ్రా నిర్వహించబోతున్నట్లు చెప్పారు. 47 మద్యం దుకాణాలకు సంబంధించి గౌడ కులస్థులకు మూడు, దుకాణాలు, ఎస్సీలకు ఐదు దుకాణాలు, ఎస్టీలకు ఒకటిగా రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. రిజర్వేషన్ కల్పించిన దుకాణాలకు దరఖాస్తు చేసుకునేవారు కుల ధృవీకరణ పత్రంతో పాటు, మూడు లక్షల రూపాయల డిడి లేదా చలాన్ జతపరుచాల్సి ఉంటుందన్నారు. కుల ధృవీకరణ పత్రం సమయానికి అందని పక్షంలో వారు నవంబరు 15 తేదీ వరకు అందజేయాల్సి ఉంటుందన్నారు. అండర్ టేకింగ్ పత్రం జతపరచాల్సి ఉంటుంది. డిడి లేద చలాన్లను జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి, నిర్మల్ పేరున తీయాల్సి ఉంటుందని తెలిపారు.



## జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మణిదీప్

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం భరత్ కాలనీకి చెందిన పత్తిపాక మణిదీప్ జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. జనగాంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా నుంచి సోమగూడెంకు చెందిన మందమర్రి మోడల్ కళాశాల ఇంటర్ సెకండీయర్ చదువుతున్న విద్యార్థి పత్తిపాక మణిదీప్ ప్రతిభ చూపి జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడని మంచిర్యాల జిల్లా డీఐఈవో ఆంజయ్య, ఏసీఎఫ్ సెక్రటరీ బాబురావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మణిదీప్‌ను అభినందించి ఎంపిక పత్రం అందించారు. ఎంపికైన వారు శ్రీనగర్ లో వచ్చే నెల 2 నుంచి 12వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఫుట్‌బాల్ టీంకు కోచ్‌గా గాలిపెల్లి సురేందర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా ఒలంపిక్ అసోసియేషన్, ఫుట్‌బాల్ సెక్రెటరీ రఘునాథరెడ్డి, శేఖర్‌తో పాటు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థి, తల్లిదండ్రులు పత్తిపాక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

### పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం రాత్రి బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ అభిలాష పాల్గొన్నారు. జిల్లా అధికారులు, పట్టణప్రాంత మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలు పేర్చారు. బతుకమ్మల వద్ద కలెక్టర్ పూజలు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా, కలెక్టర్ అధికారులతో, పట్టణ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ బతుకమ్మ వేడుకల్లో జిల్లా అధికారులు, పట్టణ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

### రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని



**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమలుపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు ఆమెతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎన్నికల నియమావళి అనుసరిస్తూ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లను తొలగించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ఎన్నికల నిర్వహించడానికి అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎంపిటిసి, జడ్పిటిసి, వార్డు సభ్యుల సర్పంచి ఎన్నికల నిర్వహణకు సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలన్నారు. సరిపడినన్ని బ్యాలెట్ బాక్స్ లను, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండాలని, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జిల్లాలలో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి, తనికీలు చేపట్టాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టే అంశాలపై నిఘా పెంచాలని పర్యవేక్షణకు, ఫ్లయింగ్ స్కాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మాట్లాడుతూ, జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎటువంటి లోటు పాట్లు జరగకుండా ఎన్నికలను నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రెవెన్యూ, తదితర శాఖలు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సమావే శంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మహిళల రక్షణ కోసం షీ టీం బృందాలు

- పట్టణంలోని పలు ప్రధాన దర్గా మండపాలను సందర్శించిన ఎస్పీ అఖిల్ మహాజన్
- ఆకతాయిల వేధిస్తే డయల్ 100 లేదా షీ టీం బృందాలను సంప్రదించాలి
- బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఎస్పీ..

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గా, శారదా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. పట్టణంలోని మహిళల ఆహ్వానం మేరకు పలు మండపాలను సందర్శించిన జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణకై షీ టీం బృందాలు అందుబాటులో ఉంటాయని ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా, ఆకతాయిల వేధింపుల కైనా, డైల్ 100 ద్వారా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చునని షీ టీం బృందాలు పోలీసు బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సరైన సమయంలో పూర్తి చేయాలని సూచించారు. బతుకమ్మ సంబరాలలో పాల్గొని తెలంగాణలో సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా బతుకమ్మ సంబరాలను ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని ప్రధానంగా గంగపుత్ర సంఘం మండపం, మున్నూరు కాపు సంఘం మండపం, చౌడేశ్వరి మాత ఆలయ మండపం, మహాలక్ష్మి ఆలయ మండపం, టైలర్స్ కాలనీ దుర్గ మాత మండపం, శ్రీనగర్ కాలనీ బతుకమ్మ సంబరాలలో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా మండప కమిటీ సభ్యులు ఎస్పీని సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. పాల్గొన్న ప్రతి మండపం వద్ద జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా దుర్గామాత శారదా దేవి విగ్రహాలకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి.సునీల్ కుమార్, ఎస్ఐ పీర్ సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







## దైవభక్తిని పెంపొందించేలా పండగలు

### శరన్నవరాత్రి ఉత్సవ పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయల్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
హిందువుల జరుపుకునే పండగలన్ని దైవభక్తిని పెంపొందించేలా ఉంటాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. వైశ్య రక్షక్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏటా చేపట్టే ఛలో శ్రీ నవశక్తి దుర్గామాత ఆలయ పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ముందుగా శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కన్యకా పరమేశ్వరీ ఆలయం నుండి పట్టణ శివారులోని శ్రీ నవశక్తి దుర్గామాత ఆలయం వరకు చేపట్టే పాదయాత్రను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కాషాయ జెండాలను చేతపట్టుకుని పెద్దఎత్తున భక్తులు పాదయాత్రలో పాల్గొనగా, భక్తులు చేసిన జై మాతాజీ నినాదాలతో పట్టణ ప్రధాన వీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో హిందూ సమాజ ఉత్సవ సమితి అధ్యక్షులు బొంపెల్లి హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి రాళ్లబండి మహేందర్, సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి తో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త రాజేశ్వర్, బీజేపీ నాయకులు లాలా మున్న, రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లిలో సోమవారం రాత్రి మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని పలుచోట్ల నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొని మహిళలతో కలిసి బతకమ్మ ఆడారు. పట్టణంలోని కాల్టెక్స్ ప్రాంతంలో మాజీ కౌన్సిలర్ దంపతులు నెల్లి శ్రీలత రమేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే వినోద్ ఆడి పాడారు. పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించిన మహిళలను ఆయన అభినందించారు. పట్టణంలోని 11వ వార్డులో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే స్థానికంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాన్ని దర్శించుకున్నారు. రైల్వే స్టేషన్, ఏఎంసి, గంగారాం నగర్ ప్రాంతాల్లో మహిళలతో కలిసి ఎమ్మెల్యే వినోద్ బతుకమ్మ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రాంతంలో మహిళలు ఈసారి పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం చాలా



సంతోషంగా ఉందని అన్నారు. మహిళల సంక్షేమానికి తాను కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మను ఆడపడుచులందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవడం అభినందనీయమన్నారు. అదేవిధంగా బెల్లంపల్లి పట్టణంలోని పలుచోట్ల మహిళలు బతుకమ్మ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. పోచమ్మ చెరువు వద్ద అధికారులు బతుకమ్మ ఆడేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

# ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ఎన్నికల నియమావళిని అధికారులు తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికలపై రిటర్నింగ్ అధికారులకు ట్రైనింగ్ నిర్వహించారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ పర్యవేక్షణలో కొనసాగించాలన్నారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో రిటర్నింగ్ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకమని, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అసిస్టెంట్ శిక్షణ కలెక్టర్ సలోని చబ్ర, జడ్పీ ఇన్చార్జి సీఈఓ రవీందర్ రాథోడ్, డీపీఓ, ఆర్ఓలు పాల్గొన్నారు.






## జన్నారం మండల సర్పంచ్, ఎంపీటీసీ రిజర్వేషన్లు

**జన్నారం, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్ రిజర్వేషన్లకు సంబంధించిన జాబితాను తయారు చేయడం జరిగిందని ఎంపీడీవో ఉమర్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ధర్మారం గ్రామ పంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్ ఎస్టీ మహిళ అలాగే తిమ్మాపూర్ ఎస్టీ జనరల్, ఇంధన్ పల్లి ఎస్టీ జనరల్, కవ్వాల్ ఎస్టీ జనరల్, బంగారు తండా ఎస్టీ మహిళ, హాస్టల్ తండా ఎస్టీ జనరల్, మల్యాల్ ఎస్టీ మహిళ, లోత్రొర్రే ఎస్టీ జనరల్, సింగరాయ పెట్ ఎస్టీ మహిళకు కేటాయించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మొర్రిగూడ ఎస్సీ మహిళ, రోటి గూడ ఎస్సీ జనరల్, మహమ్మదాబాద్ ఎస్సీ మహిళ, బాదంపల్లి ఎస్సీ మహిళ, తపాలాపూర్ ఎస్సీ జనరల్, దేవుని గూడా ఎస్సీ జనరల్ అలాగే లింగయ్య పల్లి బీసీ మహిళ, చింతలపల్లి బీసీ జనరల్, 9. గుడిసెల పల్లె బీసీ జనరల్, కలమడుగు బీసీ మహిళ, చింతగూడ బీసీ జనరల్, రేండ్లగూడ బీసీ మహిళ, జన్నారం బీసీ మహిళ, పొనకల్ బీసీ మహిళ, రాంపూర్ బీసీ జనరల్, కిష్టాపూర్ బీసీ జనరల్ అలాగే మురిమడుగు జనరల్ మహిళ, కొత్తపేట్ జనరల్ మహిళ, వెంకటాపూర్ జనరల్, కామన్ పల్లి జనరల్ లను కేటాయించడం జరిగిందని ఉమర్ షరీఫ్ తెలిపారు.

**15 ఎంపీటీసీల రిజర్వేషన్ల జాబితా...**
జన్నారం మండలంలోని 15 ఎంపీటీసీ ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను సైతం ప్రకటించడం జరిగిందని ఎంపీడీవో ఉమర్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంధన్ పల్లి ఎంపీటీసీ స్థానానికి ఎస్టీ మహిళ, మొర్రిగూడ ఎస్టీ జనరల్, అలాగే కవ్వాల్ ఎస్సీ జనరల్, లింగయ్య పల్లె ఎస్సీ మహిళ, దేవుని గూడా ఎస్సీ జనరల్, రోటి గూడ ఎస్సీ మహిళ, అదేవిధంగా తపాలాపూర్ బీసీ మహిళ, కలమడుగు బీసీ జనరల్, చింతగూడ బిసి మహిళ, పొనకల్ బీసీ జనరల్, జన్నారం బీసీ మహిళ, రేండ్లగూడ బీసీ జనరల్, అలాగే చింతలపల్లి జనరల్, మురిమడుగు మహిళా జనరల్, రాంపూర్ ఎంపీటీసీ స్థానాన్ని జనరల్ కు కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా
### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఇటీవలి నిర్మల్ జిల్లాకు జల్ సంచాయ్ – జన భాగిధారి కార్యక్రమంలో అవార్డు లభించినందున, అధికారులను కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ, మరిన్ని అవార్డులు సాధించి, జిల్లా పేరును దేశ వ్యాప్తంగా నిలపాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి, ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కోడ్ ముగియగానే ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. అధికారులంతా ఎన్నికల కోడ్‌ను తప్పనిసరి పాటించాలి ఆదేశించారు. ఎలక్షన్ కోడ్ జిల్లాలో పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# సద్దుల బతుకమ్మ సంబరాలు





**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)** జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబురాలు సోమవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పూల పండుగకు మహిళలు ఉదయాన్నే లేచి ఉపవాసంతో తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో మహిళల పండుగైన బతుకమ్మ వేడుకలలో చిన్నా, పెద్ద తేడా లేకుండా మహిళలు అందరు పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో, తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలతో కూడలీల వద్ద, ఆలయాల వద్దకు చేరుకొని తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయ పాటలతో బతుకమ్మ ఆడారు. పల్లెల్లో, సింగరేణి కాలనీల్లో మహిళలు కోలాటాలాడారు. రాత్రి బతుకమ్మలను సమీప గోదావరి తీరంలో, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. సత్తు పిండిని పంచి వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

**సాంప్రదాయ రీతిలో బతుకమ్మ వేడుకలు...**

బెల్లంపల్లి పట్టణంలో సోమవారం రాత్రి మహిళలు సాంప్రదాయ రీతిలో బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. తీరొక్క పూలతో అలంకరించిన రంగురంగుల బతుకమ్మలతో మహిళలు ఒక్కచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. తెలంగాణ ఆత్మగౌరవం ప్రతిభంభించేలా సాంప్రదాయ దుస్తులలో దేవాలయాల వద్ద కోలాటలాడారు. పలు కాలనీలలో మహిళలు వేడుకలను నిర్వహించి బతుకమ్మలను స్థానిక పోచమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. బతుకమ్మ పండుగ కోసం ఇళ్లల్లో సిద్ధం చేసిన సత్తు పిండిని ఒకరికొకరు పంచుకొని వాయినం ఇచ్చుకున్నారు. మహిళల కోలాటాల చప్పుళ్ళు, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే పాటల హోరు మధ్య బతుకమ్మ వేడుకలు కన్నుల పండుగగా ముగిశాయి.

**బెల్లంపల్లి మార్కెట్‌లో పూల సందడి...**

బతుకమ్మ పండుగ సందర్భంగా సోమవారం బెల్లంపల్లి మార్కెట్లో పూల సందడి నెలకొంది. ఉదయం నుండే పాత బస్టాండ్ నుండి కాంటా చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై పూల అమ్మకాలు జోరుగా సాగాయి. భీమిని, నెన్నెల, మండలాలతోపాటు బెల్లంపల్లి ప్రాంతంలోని చిన్నభూద, కాశిరెడ్డిపల్లి, రాళ్ల పేట ,చంద్రవెల్లి గ్రామాల నుండి రైతులు తీరొక్క బతుకమ్మ పూలను తీసుకువచ్చి అమ్మకాలు జరిపారు. వివిధ రకాల బంతిపూల తో పాటు, సీతమ్మ జడ, గునూగు, తంగేడు పూల కొనుగోళ్లతో సోమవారం ప్రధాన మెయిన్ బజార్ ప్రాంతం మహిళలతో సందడిగా మారింది.

**ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే...**

బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ చెరువు వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరిశీలించారు. బతుకమ్మ ఆడే మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, ఏసీబీ రవికుమార్‌లకు సూచించారు. బతుకమ్మ గాట్ వద్ద ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ సిబ్బంది, గజ ఈతగాలను అందుబాటులో ఉంచినట్లు వారు ఎమ్మెల్యే వినోద్‌కు సూచించారు. మహిళలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వినోద్ కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల మల్లయ్య, స్వామి, మునిమంద రమేష్ తదితరులున్నారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలి



- జిల్లాలో అమల్లోకి ఎన్నికల కోడ్
- ఎలక్షన్ కోడ్‌ను ప్రతి ఒక్కరు పాటించాలి
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష తెలిపారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని అన్నారు. ఎలక్షన్ కోడ్‌ను ప్రతి ఒక్కరు పాటించాలని వివరించారు. ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే పలు దశల్లో అధికారులందరికీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సరిపడినన్ని పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, తదితర సామాగ్రిని మొత్తం సమకూర్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో భాగంగా జిల్లా ఎస్పీ జానక్ షర్మిల మాట్లాడుతూ, రెవెన్యూ, ఇతర అధికారుల సమన్వయంతో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించమని చెప్పారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున సరైన పత్రాలు లేకుండా 50 వేల నగదును వెంట తీసుకు వెళ్ళరాదని అన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మోగిన 'స్థానిక' ఎన్నికల నగారా

**షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం**

**రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు**

**మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు**

**335 జీపీలు, 127ఎంపీటీసీ, 15జడ్పీటీసీ స్థానాలు**

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నారు. జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 127 ఎంపీటీసీ స్థానాలు, 15 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇదివరకే అధికారులు అయా స్థానాల్లో రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు అక్టోబరు 23న తొలి విడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహించనుంది. అలాగే గ్రామ పంచాయతీలకు అక్టోబరు 31న తొలి విడత, నవంబరు 4న రెండో విడత, నవంబరు 8న మూడో విడత ఎన్నికలను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. పోలింగ్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. నవంబరు 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొలి విడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 9 నుంచి 11 వరకు ఉంటుంది. రెండో విడత నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 13 నుంచి 15 వరకు ఉంటుంది. అలాగే గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 17నుంచి 19 వరకు, రెండో విడత నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 21 నుంచి 23 వరకు, మూడో విడత అక్టోబరు 25 నుంచి 27 వరకు కొనసాగుతుంది.

**సర్పంచ్, ఎంపీటీసీల వారీగా రిజర్వేషన్లు...**

జిల్లాలో 335 గ్రామపంచాయతీలు ఉండగా వాటి పరిధిలో 2,874 వార్డులు ఉన్నాయి. 15 మండలాల పరిధిలో 127 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అధికారులు జనాభా ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేశారు.

**కేటగిరి సర్పంచ్ వార్డు ఎంపీటీసీ...**

ఎస్టీ 198 1292 39, ఎస్సీ 32 226 18, బీసీ 67 534 41, జనరల్ 38 822 29, మొత్తం 335 2,874 127.

# బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

**కుభీర్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

మండలంలోని చాత గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రయివేట్ గా విధులు నిర్వహిస్తున్న భోజన్న ఇటీవల గ్రామంలో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేసే క్రమంలో ప్రమాదవాషత్తు విద్యుత్ స్తంభం నుంచి కింద పడి ప్రమాదానికి గురి అయ్యాడు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నాడు. భోజన్న వెన్నుముక భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో వైద్య ఖర్చులు లక్షల్లో అవుతాయని వైద్యులు తెలపడంతో బాధిత కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలసి సోమవారం విద్యుత్ శాఖ అధికారి, పంచాయతీ, తహసీల్దార్‌లకు వేరు వేరుగా వినతిపత్రలు అందజేశారు.

# ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందించిన శిక్షణ కార్యక్రమానికి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని తెలిపారు. నోటిఫికేషన్ విడుదల అయినందున ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు.

# గుంతలను పూడ్చిన మాలగూడ యువకులు

**ఉట్నూర్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

మండలంలోని దంతన్ పల్లి గ్రామ సమీపంలోని ఉట్నూర్-మంచిర్యాల రోడ్డు వద్ద ఏర్పడిన పెద్ద గుంతల వల్ల వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన మాలగూడ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గుంతలను పూడ్చారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు యువకుల స్వచ్ఛంద ప్రయత్నాన్ని ప్రశంసిస్తున్నారు. ఇలాంటి చర్యలు సమాజంలో పాజిటివ్ చైతన్యంను సృష్టించి, యువతను ఇతరులకు స్ఫూర్తిగా మారుస్తాయని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.





# మోగిన నగారా

- స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల
- మొత్తం ఐదు విడుతల్లో నిర్వహణ
- రెండు విడుతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- ఆ తరువాత 3 విడతల్లో పంచాయతీ ఎలక్షన్లు
- అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల
- అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం
- తక్షణమే అమల్లోకి ఎన్నికల కోడ్

**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. స్థానిక సంస్థల ఎన్నికలను మొత్తం ఐదు విడుతల్లో నిర్వహిం చేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు విడుతల్లో జడ్పీటీసీ, ఎం పీటీసీ ఎన్నికలు జరుగనుండగా, పంచాయతీ ఎన్నికలను మూడు విడుతలుగా నిర్వహించనున్నారు. వాస్తవానికి లోక్‌సభ ఎలక్షన్లు ముగియగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పాలనపై పట్టు సాధించేందుకు కొంత సమయం పట్టింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో సంవత్సరం పాటు జాప్యం జరిగింది. గ్రామ పంచాయతీల పాలన గత సంవత్సరం జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల ప రిషత్‌ల పాలక వర్గాల పదవీకాలం జూలైతో ముగి సింది. ఏడాది సుధీర్ఘ సమయం దాటిన తరువాత ఎట్టకేలకు మార్గం సుగమం కావడంతో పల్లెల్లో ఎన్నికల సం దడి నెలకొంది. జిల్లాలో మొత్తం 16 మండలాలు ఉండ గా.... జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు కూడా అంతే మొత్తంలో ఉన్నాయి. అలాగే ఎంపీటీసీ స్థానాలు 129 ఉన్నాయి. మొత్తం ఎంపీటీసీ స్థానాలకుగాను బీసీలకు 54, ఎస్సీలకు 33, ఎస్టీలకు 14, జనరల్‌కు 28 కేటాయిం చారు. అలాగే 306 సర్పంచ్ స్థానాల్లో బీసీలకు 109, ఎస్సీలకు 81, ఎస్టీలకు 65, జనరల్‌కు 51 స్థానాలను కేటాయించారు. ఎలక్షన్ షెడ్యూల్ విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చింది.

**జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఇలా...**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదట జడ్పీ టీసీ, ఎంపీపీ ఎలక్షన్లు నిర్వహించనున్నారు. ఇందుకు గాను ఇటీవల మండలాల వారీగా అభ్యర్థులకు కేటా యించిన రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు.

జన్నారం ఎస్టీ(జనరల్) బీసీ(మహిళ), మందమర్రి ఎస్టీ (మహిళ) ఎస్టీ(మహిళ), బెల్లంపల్లి ఎస్సీ(మహిళ) ఎస్సీ (మహిళ), భీమారం ఎస్సీ(జనరల్) ఎస్టీ(జనరల్), హాజీపూర్ ఎస్సీ(మహిళ) ఎస్సీ(జనరల్), నెన్నెల ఎస్సీ(జనరల్) ఎస్సీ (జనరల్), చెన్నూరు బీసీ(మహిళ) బీసీ(మహిళ), దండేపల్లి బీసీ(జనరల్) జనరల్(మహిళ), జైపూర్ బీసీ(జనరల్) బీసీ (జనరల్), కన్నెపల్లి బీసీ(మహిళ) ఎస్సీ(మహిళ), కాసిపేట బీసీ(జనరల్) బీసీ(మహిళ), తాండూరు బీసీ(మహిళ) జనరల్, వేమనపల్లి బీసీ(జనరల్) బీసీ(జనరల్), భీమిని జనరల్ జనరల్, కోటపల్లి జనరల్ బీసీ(జనరల్), లక్షెట్టిపేట జనరల్(మహిళ) బీసీ(జనరల్)

**జిల్లాలో 3.7 లక్షల ఓటర్లు...**

పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,76,669 ఓటర్లు ఉన్నారు. వీరిలో స్త్రీలు 1,91,011 మంది ఉండగా, పురుషులు 1,85,643, ఇతరులు 15 మంది ఉన్నారు.

**మండలాల వారీగా ఓటర్ల వివరాలు...**

బెల్లంపల్లి 23464 11625 11838 01, భీమిని 11529 5844 5684 01, భీమారం 13093 6394 6699 00, చెన్నూర్ 26475 13040 13435 00, దండేపల్లి 42101 20486 21614 01, హాజీపూర్ 16954 8361 8593 00, జైపూర్ 30626 15278 15347 01, జన్నారం 44412 21670 22740 02, కన్నెపల్లి 15490 7614 7875 01, కాసిపేట 26472 13127 13342 03, కోటపల్లి 26990 13320 13668 02, లక్షెట్టిపేట 25227 12261 12966 00, మందమర్రి 11482 5678 5803 01, నెన్నెల 19371 9636 9734 01, తాండూర్ 27757 13741 14016 00, వేమనపల్లి 15226 7568 7657 01

**మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు...**

మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ మొదటి విడత అక్టోబర్ 9వ తేదీన విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 11న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 12న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన అభ్య ర్థుల జాబితా విడుదల, 13న అప్పీళ్లకు గడువు, 14న పరిష్కరణ, 15న నామినే షన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడు దల, 23న ఎన్నికల నిర్వహణ, నవంబరు 11న ఓట్ల లెక్కింపు

**రెండో విడత...**

అక్టోబర్ 13వ తేదీన మండల, జిల్లా పరిషత్ ఎన్ని కల నోటిఫికేషన్ రెండో విడుత విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జా బితా ప్రదర్శన, 15న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 16న నామినేషన (పరిశీలన, చెల్లుబాటైన అభ్యర్థుల జా బితా విడుదల, 17న అప్పీళ్లకు గడువు, 18న అప్పీళ్ల ప రిష్కరణ, 19న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అ భ్యర్థుల తుది జాబితా విడుదల, 27న ఎన్నికల నిర్వహణ, నవంబరు11నఓట్ల లెక్కింపు

**గ్రామ పంచాయతీ ఎన్నికలు... మొదటి విడుత...**

మొదటి విడుత గ్రామ పంచాయతీ ఎన్నికలకుఅక్టోబర్ 17వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం కానుంది. ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. 19న నామినేషన్ల దాఖలు కు చివరి తేదీ, 20న నామినేషన్ల పరిశీలన, చెల్లుబా టైన అభ్యర్థుల జాబితా విడుదల, 21న అప్పీళ్లకు గడు వు, 22న అప్పీళ్ల పరిష్కరణ, 23న నామినేషన్ల ఉప సంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, 31న ఎన్నికల నిర్వహణతో పాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరపనున్నారు.

**రెండో విడుత...**

అక్టోబర్ 21న రెండో విడుత విడుదల కానుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జా బితా ప్రదర్శన, 23న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 24న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల జాబితా విడుదల, 25న అప్పీళ్లకు గడువు, 26న అప్పీళ్ల పరిష్కరణ, 27న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, నవంబరు 4వ తేదీన ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు

**మూడో విడుత...**

అక్టోబర్ 25వ తేదీన మూడో విడుత విడుదల కా నుండగా, అదే రోజు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం, ఓటర్ల జాబితా ప్రదర్శన, 27న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 28న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల జాబితా విడుదల, 29న అప్పీళ్లకు గడువు, 30న అప్పీళ్ల పరిష్కరణ, 31న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అనంతరం అభ్యర్థుల తుది జాబితా విడుదల, నవంబరు 8వ తేదీన ఎన్నికల నిర్వహణ, తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.

# కలెక్టరేట్ ఎదుట రేషన్ డీలర్ల నిరసన



**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని రేషన్ డీలర్లకు ఆరు నెలల కమిషన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమ వారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట మంచిర్యాల జిల్లా చౌకధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్య క్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పంపిణీ చేసిన ఉచిత బియ్యానికి సంబంధించిన కమీషన్ ఆరు నెలలు గడుస్తున్నా ఇవ్వలేదన్నారు. కమీషన్ రాకపోవ డంతో కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన గౌరవ వేతనం రూ.5వేలు, రూ.300 కమీషన్ ఇప్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కృష్ణ, మహేందర్, పాల్గొన్నారు.

కమిషన్ బకాయిలు వెంటనే చెల్లించాలి

**రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవ్ రావ్**

**ఆసిఫాబాద్ :** రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవ్ రావ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం రేషన్ డీలర్లు నిరసన చేపట్టారు. రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవ్ రావ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో ఆడుకుంటున్నాయన్నారు. మేము ప్రజలకు ప్రభుత్వాల మధ్య వారధిగా పనిచేస్తున్నా, ఇచ్చే కమిషన్‌తో కుటుంబాలను పోషించలేకపోతున్నమని, ఇప్పటికే 6 నెలల కమిషన్ బకాయిలు ఉన్నా చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ, దసరా, దీపావళి వంటి పెద్ద పండగలకు కనీసం కుటుంబాలకు బట్టలు కొనడానికైనా డబ్బులేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు రూ.5000 గౌరవ వేతనం ఇస్తామ ని హామీ ఇచ్చినా ఇప్పటిదాకా అమలు చేయలేదని ఆరోపించారు. కింటాల బియ్యానికి రూ.300 కమిషన్ ఇస్తామని చెప్పినా అమలు కాలేదన్నారు. రేషన్ డీలర్లకు హెల్త్ కార్డులు, రూ.25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ వర్తించచాలని, ఎమ్మెల్సీ పాయింట్ వద్ద తూకంలో తక్కువ రాకుండా వెబ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేరు శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు పైడి పురుషోత్తం, కోశాధికారి జాడే ఆత్మరావు పాల్గొన్నారు.




## గిరిజన విద్యార్థులకు ల్యాప్ ట్యాప్‌ల పంపిణీ

**ఉట్నూర్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

గిరిజన విద్యార్థులకు ల్యాప్ టాప్ లను సోమవారం ఐటడిఎ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా పంపిణీ చేసారు. ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థి నేరడిగొండ మండలం బుగ్గరాం గ్రామానికి చెందిన జాదవ్ నవనీత్ కు ప్రోత్సాహకంగా ల్యాప్ ట్యాప్ అందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యలో తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలవాలన్నారు. బిటెక్‌లో కంప్యూటర్ సైన్స్ చదవుల కొర కు వారి తల్లిదండ్రుల సమక్షంలో పై చదువుల నిమిత్తం ల్యాప్ టాప్ గిరిజన విద్యార్థుకి అందించడం జరిగిందని తెలిపారు.

## ఆశ్రమ స్కూల్ డైలీవైజ్ వర్కర్ల రాస్తారోకో

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

తమ సమస్యలను పరిష్కరించాలని డి మాండ్ చేస్తూ ఆశ్రమ పాఠశాల డైయిలీ వైజ్ వర్కర్లు సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ ప్రధాన రోడ్డు పై బైఠాయించి సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. పెండింగ్ వేతనాలు చెల్లించడం తోపాటు జీవో 64నురద్దుచేసి. టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 18 రోజుల సమ్మె చేస్తున్న తమ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## బతుకమ్మ చీరెల పంపిణీకి ఎన్నికల కోడ్ అడ్డంకి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

గత సర్కార్ హయాంలో మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేయగా. ఇప్పుడు ఇక మహిళ సంఘాలకే ఇవ్వనున్నారు. కొమురం భీం జిల్లా వ్యాప్తంగా సుమారు 1లక్ష రెండు వేలు మహిళ సభ్యులు ఉండగా 32 వేల చీరెలు జిల్లాకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక బతుకమ్మ చీరెల పంపిణీకి స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. మరోవైపు సద్దుల బతుకమ్మ మంగళవారం ఉండగా నేటివరకు చీరెలు పంపిణీ జరగలేదు. ఆపై స్థానిక సంస్థల ఎన్నికలు పూర్త య్యేవరకు కోడ్ అమలులో ఉండనుంది.

## దుర్గా దేవికి ప్రత్యేక పూజల్లో ప్రముఖులు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రాల్లోని బాపు నగర్‌లో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా చైర్మన్ అరిగెల నాగేశ్వరరావు మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన ప్రముఖులకు కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. పూజారి రాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండి ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ



కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, ముక్త విలాస్, సిద్ధంశెట్టి అశ్విన్, సుగుణాకర్, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్, శ్రీనివాస్, తో పాటు కాంగ్రెస్ నాయకులు చరణ్, బలరాం నాయక్, అడ్వకేట్ దీపక్ పాల్గొన్నారు.

# అదే నిజమైన ప్రేమ:సమంత



స్టార్ హీరోయిన్ సమంత తాజాగా తన ఇన్‌స్టా లో పోస్ట్ చేసిన మెసేజ్ ప్రస్తుతం వైరల్ గా మారింది. ఇంతకీ, సమంత తన పోస్ట్ లో ఏం రాసుకొచ్చింది అంటే.. 'నేను, నా మేకప్ ఆర్టిస్ట్ ఎన్నో విషయాల గురించి మాట్లాడుకున్నాం. ఆ చర్చ నన్ను ఆలోచింపజేసింది. ముప్పై ఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారుతుంది. ప్రతిదీ తగ్గుముఖం పడుతుంది. మీ అందం, మీ మెరుపు అన్నిట్లో మార్పు వస్తుంది. అందుకే జీవితాన్ని ఆస్వాదించాలంటే ఇరవైలలోనే ఏదైనా చేయాలి. లేకపోతే, మీకు ప్రతి దానికి సమయం లేదు అనిపిస్తోంది' అని సమంత తన పోస్ట్ లో రాసుకొచ్చింది. సమంత ఇంకా తన పోస్ట్ లో రాసుకొస్తూ.. 'నేను ఇరవైలలో ఉన్నప్పుడు చాలా గందరగోళంగా ఉండేదాన్ని. ముఖ్యంగా నాకు అంటూ మంచి గుర్తింపు కావాలని ఆరాటపడేదాన్ని. ఆ సమయంలో నన్ను నేను ఎంత కోల్పోయాను. ఆ సమయంలో, ప్రేమ గురించి నాకెవరూ చెప్పలేదు. నిజమైన ప్రేమ మనలోనే ఉంటుందని అది బయట నుంచి రాదనే విషయాన్ని నాకు అప్పుడు ఎవరూ చెప్పలేదు. మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని తర్వాత అర్థం చేసుకున్నా' అని సమంత తెలిపింది. ఉన్నట్టు ఉండి సమంత ఎందుకు ఈ పోస్ట్ పెట్టింది అంటూ నెటిజన్లు పోస్ట్ లు పెడుతున్నారు.

# కలెక్షన్లు కుమ్మేస్తున్న ఓజీ..





పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా నాలుగు రోజుల్లో రూ.200 కోట్ల క్లబ్‌లోకి చేరింది. ప్రపంచవ్యాప్తంగా రూ.252 + కోట్లు (గ్రాస్) వసూలు చేసిందని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టర్ విడుదల చేసింది. విడుదలైన రోజే రూ.154 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టింది. ఫస్ట్ డే అత్యధిక వసూలు చేసిన టాప్10 భారతీయ సినిమాల జాబితాలో 'ఓజీ' చోటు దక్కించుకుంది. టాలీవుడ్ నుంచి ఏడో చిత్రమిది. ఈ నెల 25న బాక్సాఫీసు ముందుకొచ్చింది. కొన్నాళ్లుగా అభిమానులు పవన్ నుంచి ఎలాంటి సినిమానైతే ఆశించారో అదే 'ఓజీ'. సుజీత్ తెరకెక్కించిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా మూవీలో పవన్.. ఓజస్ గంభీరగా నటించిన సంగతి తెలిసిందే. ఆయుధాలను ఆయన వినియోగించిన తీరు, పవర్‌ఫుల్ డైలాగ్స్, స్టైలిష్ లుక్స్, నేపథ్య సంగీతం.. ఇలా ఎన్నో అంశాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. మరికొన్ని రోజుల్లో విజయోత్సవ వేడుకను నిర్వహించేందుకు చిత్ర బృందం ప్లాన్ చేసిందని, పవన్ కల్యాణ్ కూడా పాల్గొంటారని సమాచారం.

# చూపులతోనే మాయ చేస్తున్న చందమామ



ప్రస్తుత కాలంలో హీరోయిన్లు ఏ రేంజ్ లో ఫిట్నెస్ మైంటైన్ చేస్తున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. నాలుగు పదుల వయసు దాటినా ఇంకా అంతే అందంగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. దీనికి తోడు ఇద్దరు పిల్లల తల్లులైనా సరే తమ అందంతో.. నిత్యయవ్వనంతో అలరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ హీరోయిన్స్ ని చూస్తే వీళ్ళు పిల్లల తల్లుల్లాగా అనిపించడం లేదు అంటూ నెటిజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు.. అలా ఎప్పటికప్పుడు తన అందంతో, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న వారిలో కాజల్ అగర్వాల్ కూడా ఒకరు. ఈమధ్య నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ ముద్దుగుమ్మ.. అటు సినిమాలలో కూడా అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయిన విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే తాజాగా ప్రేక్షకులను అలరించడానికి మరో ఔట్ ఫిట్ తో ఇంస్టాగ్రామ్ వేదికగా మన ముందుకు వచ్చేసింది. ఇందులో బ్లాక్ అండ్ వైట్ ట్రెండీ అవుట్ ఫిట్ ధరించి అందాలతో అలరిస్తోంది. కాజల్ అగర్వాల్ ను చూస్తే ఇంకా స్వీట్ 20 లాగే ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. కాటుక కళ్ళతో మాయ చేస్తూ నెటిజన్స్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా కాజల్ అగర్వాల్ షేర్ చేసిన ఈ ఇంస్టాగ్రామ్ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. కాజల్ అగర్వాల్ సినిమా కెరియర్ విషయానికి వస్తే.. తేజ దర్శకత్వంలో వచ్చిన లక్ష్మీ కళ్యాణం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. 2007లో వచ్చిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత 2009లో మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ హీరోగా, రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన మగధీర సినిమాలో నటించిన కాజల్ కి ఇద్దరికీ ఇది రెండవ సినిమా కావడం గమనార్హం. అంతేకాదు ఈ ఇద్దరికీ బ్రేక్ ఇచ్చిన సినిమా కూడా ఇదే అని చెప్పవచ్చు.



# రాజా సాబ్" ఇంట్రో సాంగ్ పై క్రేజీ న్యూస్

కమర్షియల్ డైరెక్టర్ మారుతి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో ఓ భారీ పాన్ ఇండియా సినిమాని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ పై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఐతే, తాజాగా దర్శకుడు మారుతి అభిమానుల కోసం ఒక ఉత్తేజకరమైన అప్ డేట్ ను పంచుకున్నారు: ప్రభాస్ ఇంట్రడక్షన్ పాట షూటింగ్ పూర్తయిందని సోషల్ మీడియాలో తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. అభిమానులు ఈ పాట కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అన్నట్టు ఈ పాటను అక్టోబర్ 23, 2025 న – ప్రభాస్ పుట్టినరోజున మొదటి సింగిల్‌గా విడుదల చేయవచ్చు. ఇక ది రాజా సాబ్ ట్రైలర్ ఈరోజు సాయంత్రం 6 గంటలకు గ్రాండ్ ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విడుదలకు సిద్ధంగా ఉంది. మరి ఈ ట్రైలర్ ఎలా ఉండబోతుందో చూడాలి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ మరియు రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జనవరి 9, 2026న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మొత్తమ్మీద మారుతి ఈ ప్రాజెక్ట్ కోసం అద్భుతమైన ఎలిమెంట్స్ ను సిద్ధం చేశాడట. అన్నట్టు ప్రభాస్ కి పూర్తిగా ఇది కొత్త జోనర్ అవుతుంది.



### స్థానిక సంస్థల ఎన్నికలకు

## పకడ్బందీ బందోబస్తు

**నిర్మల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ తరపున పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ, ఇతర అధికారుల సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, సరైన పత్రాలు లేకుండా 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లరాదని, అంత ర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, లైసెన్స్ గన్ ఉన్నవారు పోలీస్ కార్యాలయాల్లో సరెండర్ చేయాలని సూచించారు.

## కలెక్టరేట్ ఎదుట డీలర్ల నిరసన



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

డీలర్ల పెండింగ్ కమీషన్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆరునెలలు కమీషన్ డబ్బులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వేంటనే పెండింగ్ కమీషన్ డబ్బులు చెల్లించడంతో పాటు డీలర్లకు కనీసం 5 వేలు గౌరవ వేతనం. క్వింటాళ్ల 300 కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 1 నుంచి రేషన్ పంపిణీ నిలిపివేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అందజేశారు.

## మహిళలకు చీరలు పంపిణీ

**మందమర్రి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

పూలను దేవతగా కొలిచి పూజించే బతుకమ్మ పండుగ పురస్కరించుకొని మహిళలకు చీరలు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. తహసిల్దార్ సతీష్ కుమార్. తన కూతురు మనస్విని జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని, సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా సోమవారం రెవెన్యూ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన మహిళలకు చీరలను కానుకగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలను దేవతగా పూజించే, తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ బతుకమ్మ పండుగ, తన కూతురు జన్మదినం రెండు ఒకే రోజు రావడంతో ఆడపడుచులు ఎంతో సంతోషంగా జరుపుకునే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కార్యాలయంకు వచ్చిన మహిళలకు చీరలు అందించడం ఎంతో తృప్తి నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా మనస్వినికి పలువురు మహిళలు ఆశీర్వాదాలు అందజేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి రాథోడ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎన్నికల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలి

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన విడుదల అయినందున నిర్వహణలో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వచ్చినందున నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు, బందోబస్తు, అధికారులు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, రక్షణ ఏర్పాట్లు ఇతర ఎన్నికల అంశాలకు సంబంధించి అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే ప్రచార అంశాలను వెంటనే తొలగించాలని, మీడియాలో వచ్చే ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జెడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి. ఎన్నికలు ప్రతి జిల్లాలో రెండు విడతలలో నిర్వహించడం జరుగుతుందని, సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు ఎంపిక చేయబడిన జిల్లాలలో మూడు విడతలుగా, మిగతా జిల్లాలలో రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నోటీసు జారీ, ఓటర్ల జాబితా ప్రదర్శన, నామినేషన్ల దాఖలు, పరిశీలన, చెల్లుబాటయ్యే నామినేటెడ్ అభ్యర్థుల జాబితా, అప్పీలు, అప్పీళ్ల పరిష్కరణ, అభ్యర్థిత్వం ఉపసంహరణ, పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ, పోలింగ్ నిర్వహణ, రీపోల్ ఉన్నట్లయితే సంబంధిత ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు, ప్రకటన ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర అదనపు డి.జి.పి. మహేష్ భగవత్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి చర్యలకు తావు లేకుండా బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత, సిసి టివి పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా ఎస్. పి. కాంతిలాల్ సుభాష్, అదనపు ఎస్.పి., జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ జాసిన్త్ జోల్, జిల్లా రెవెన్యూ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం నిబంధనలను జిల్లాలో కచ్చితంగా అమలు చేసే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. రక్షణ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామాగ్రి, అదనపు సామాగ్రి సమకూర్చడం, బందోబస్తు, ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 2 విడతలలో జెడ్ పి టి సి, ఎం పి టి సి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా అమలు చేస్తామని, పోలింగ్ కొరకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఫ్లయింగ్ సర్వేయలెన్స్ బృందం, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్, ఇతర ఎన్నికల సంబంధిత ఇబ్బంది నియామకం చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొదటి విడతలో 8 జెడ్ పిటిసి, 71 ఎంపిటిసి. స్థానాలకు, రెండవ విడతలో 7 జెడ్‌పిటిసి, 56 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 5 మండలాలలో 114 గ్రామపంచాయతీలు, 944 వార్డులకు, రెండవ విడతలో 6 మండలాలలోని 113 గ్రామపంచాయతీలు, 992 వార్డులకు, మూడవ విడతలో 4 మండలాలలోని 108 గ్రామపంచాయతీలు, 938 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొత్తం 15 మండలాలలో గల 335 గ్రామపంచాయతీలు, 2 వేల 874 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేస్తూ సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లయ్యింది




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఎన్నిక సమయంలో రేషన్ డీలర్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. డీలర్ల నిరసన శిబిరానికి హాజరైన ఎమ్మెల్యే వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రేషన్ డీలర్లు ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏప్రిల్ నెల నుంచి ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల కమిషన్ వెంటనే చెల్లించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ సమస్యలు పరిష్కారం అవుతాయి అనుకున్న డీలర్ల సమస్య గత 10 ఏళ్ళు బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మోసగిస్తూనే ఉందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాని కంటే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన చూస్తే, ప్రస్తుతం తెలంగాణ ప్రజల బ్రతుకులు పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు అయినదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు వేణుగోపాల్‌తో పాటు పలువురు రేషన్ డీలర్లు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# బాధ్యులపై చర్యలు తప్పవు : ఆదిలాబాద్ డిఎస్పీ జీవన్ రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

సోమవారం స్థానిక ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక చౌక్ ప్రాంతంలో ఓ యువకుడు కొంగుల సాయిచరణ్ అనే వ్యక్తి నేతాజీ చౌక్ నుండి వినాయక చౌక్ వెళ్లే ప్రాంతంలో వాహనాన్ని నిర్లక్ష్యంగా రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌తో వాహనాన్ని నడుపుతూ ఉన్న క్రమంలో ఒక వృద్ధుడు కింద పడిపోయిన సందర్భంలో అదే దారి వెంట వెళ్తున్న వన్ టౌన్ పోలీస్ అధికారి హెడ్ కానిస్టేబుల్ రుక్మారెడ్డి తనని ఎందుకు అంత నిర్లక్ష్యంగా వెళ్తున్నామని అడగగా, నీకెందుకు నన్ను నువ్వు ఎందుకు అడుగుతున్నావ్ అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన సందర్భంలో ఆ సంఘటనలో పోలీసు వ్యక్తి, ఆ యువకునిపై చేయి చేసుకున్న ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని, ఈ సంఘటనపై జిల్లా పోలీసు యంత్రాంగం విచారణ చేపట్టిందని బాధ్యులపై ఖచ్చితమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమేనని, అందరి పట్ల ఒకే విధమైనటువంటి చర్యలు తీసుకోబడతాయన్నారు. విచారణ చేపట్టిన అనంతరం పోలీసు సిబ్బంది తప్పు చేసినట్లయితే శాఖా పరమైన చర్యలు తప్పవని అదేవిధంగా నిర్లక్ష్యంగా వాహనం నడిపిన లైసెన్సు లేనటువంటి యువకుని తప్పు తేలినట్లయితే అతనిపై చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. యువకుని పై ట్రిపుల్ రైడింగ్ మరియు రాష్ డ్రైవింగ్ కేసు నమోదు.



### ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో

## పదవీ విరమణ తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిగా పని చేస్తున్న సజీవన్ పదవీ విరమణ పొందిన సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమానికి జిల్లా ఎస్.పి. కాంతిలాల్ సుభాష్, అధికారులతో కలిసి హాజరై సజీవన్ దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడంలో ప్రభుత్వ ఉద్యోగి పాత్ర కీలకమైనదన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవి విరమణ తప్పనిసరి అని, పదవి విరమణ పొందిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బతుకమ్మకు 2 వరల్డ్ రికార్డులు

హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించింది. అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రికార్డు సృష్టించింది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ఏర్పాటు చేశారు. ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. భారీ బతుకమ్మ చుట్టూ మహిళలు లయబద్ధంగా ఆడారు. మంత్రి సీతక్క బతుకమ్మపాట పాడి అలరించారు. మరోవైపు సద్దుల బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబరాలు చేసుకుంటున్నారు. తీరొక్క పూలతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ వేడుకలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు వెలుగులీనాయి. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. హనుమకొండ, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల్లో మహిళలంతా సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆడి సంబరాలు చేసుకున్నారు.































# ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ వేడుకలు



ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. హరిహరి ఓ దేవ ఉయ్యాలో.. హరి యో బ్రహ్మదేవ ఉయ్యాలో.. అంటూ మహిళలు బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. ఆలయ ప్రాంగణాల్లో, వీధులు, కూడళ్ల వద్ద మహిళలు బతుకమ్మ ఆటల సం దడి కనువిందు చేసింది. చిన్నా పెద్ద తేడా లేకుండా మహిళలు సంప్రదాయ వస్త్రాలంకరణలతో లయబద్ధంగా ఆడుతూ.. పాడుతూ.. సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు పోటీపడి విభిన్న రూపాల్లో బతుకమ్మలను పేర్చి అందంగా తీర్చిదిద్దారు. నూతన వస్త్రాలు, నగలు ధరించి ఒక్క చోట చేరి బతుకమ్మ చుట్టు తిరుగుతూ పాటలు పాడుతూ ఆడడంతో పాటు యువతులు, మహిళలు కోలాటం ఆడారు. పట్టణంలోని రావుల వాడ, కన్య కాపరమేశ్వరి ఆలయం, పొట్టి శ్రీరాములు చౌక్, కంచుకోట, తారక రామానగర్, రాజంపేట, సాయినగర్, హైకాజీనగర్, బజార్‌వాడీ, హడ్కో కాలనీ, సందీప్‌నగర్, జన్నాపూర్, దస్నాపూర్‌లో కాలనీల్లో మహిళలు ఆడి పాడారు. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు జిల్లాలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, తిర్యాణి మండలాల్లో మహిళలు ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.

**కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. బతుక మ్మ చుట్టూ ఆటలు ఆడి, జానపద గీతాలతో సాంస్కృతిక సొగసును ప్రతిబింబిస్తూ కాగజ్‌నగర్‌లో సద్దుల బతుకమ్మ ఉత్సవం ఘనంగా సాగింది. బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రానికి ప్రతీక అని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు.



## 60 గంజాయి మొక్కలు పట్టివేత

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఓ వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు జైనూర్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. జైనూర్ శేకుగూడ, ధబోలి గ్రామానికి చెందిన మెస్రం సోము ఇంటి వెనుక అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు సోదాలు చేయగా 60 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. దీని విలువ సుమారు 60 వేలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## కోళ్ల పందాల స్థావరం పై పోలీసుల దాడి



భీమిని, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
మంచిర్యాల జిల్లా భీమిని మండలం రాజారాం గ్రామంలో కోళ్ల పందాలు ఆడుతున్న స్థావరంపై దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. భీమిని ఎస్.ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుట్టచప్పుడు కాకుండా గ్రామ శివారులో కోళ్ల పందాలు ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి కోళ్ల పందాల స్థావరం పై దాడి నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు నిందితులు కోడిపె.శంకర్, నాయని. సాయి, సిడెమ్.సురేష్ లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుండి రూ.1600 నగదుతో పాటు రెండు దేశి నాటు కోళ్లను స్వాధీనం చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్.ఐ వెంట సిబ్బంది వినోద్ కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్ వున్నారు.

### గంజాయి కేసులో ఇద్దరు

## నిందితులకు మూడేళ్ల జైలు

ఇచ్చోడ, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఇద్దరు నిందితులకు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శివరాం ప్రసాద్ మూడేళ్ల జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి జి. పండరి తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం గాంధీ నగర్‌కు చెందిన గుట్టె బాబు, పెద్దపల్లి జిల్లా గోదావరి ఖనికి చెందిన నడిగొట్లు అరుణ్ కుమార్లు 2021 డిసెంబర్ 20న ఉట్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వారిని తనిఖీ చేయగా 1.1 కిలోల గంజాయి లభ్యం అయింది. దీంతో కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు విధుల పోలీసు అధికారి సీహెచ్ నరేందర్ ప్రవేశ పెట్టిన పది మంది సాక్షులను పీపీ సంజయ్ కుమార్ వైరాగరె విచారించి నేరాన్ని రుజువు చేశారు. ఈ మేరకు నిందితులిద్దరికీ న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు. గంజాయి కేసులో ఆధారాలు సమర్పించిన పోలీసులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

### రాత్రి సమయంలో గోదావరి

## ఉధృతిని పర్యవేక్షించిన అధికారులు



మామడ, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సమీపంలోని గ్రామాలను, నీట మునిగిన పంట పొలాలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మునిగిన పంట పొలాల్లోకి ఎవరు వెళ్ళవద్దని సూచిస్తున్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కమల్ కోట్ గ్రామాన్ని ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీఓ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. గోదావరి నది పరివాహ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి నీరు వదలడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అటువైపు ఎవరూ వెళ్లవద్దన్నారు. గ్రామం నుంచి గుమ్మిరాల్ బ్రిడ్జి వరకు వెళ్లే బీటీ రోడ్డు పై నీరు ప్రవహిస్తుండడంతో ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టారు. నీట మునిగిన పొలాలను సర్వే చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఎవరూ అధైర్యపడవద్దని, మీకు మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



### సరస్వతీ అమ్మవారిని

## దర్శించుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ముథోల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో సోమవారం మూల నక్షత్రం సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయాధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ముధోల్‌లో పట్టపగలే చోరీ

ముథోల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఉన్న తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో సోమవారం మధ్యాహ్నం దొంగలు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన గంగాసాగర అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి ముధోల్‌లో ఎల్లమ్మ కాలనీ సమీపంలో ఉంటున్నారు. అయితే దసరా షాపింగ్ కోసం ఇంటికి తాళం వేసి సోమవారం నిజామాబాద్‌కు వెళ్లారు. నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి సాయంత్రం సమయంలో ఇంటికి చేరుకున్నారు. దీంతో దొంగతనం జరిగిన విషయం బయటపడింది. ఇంటి తాళం పగలకొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి అందులో ఉన్న ఐదు లక్షల నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలు, 15తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు. ముధోల్‌లో వ్యాపార నిమిత్తం నగదును ఇంట్లో దాచి ఉంచామని బాధితులు తెలిపారు. చోరీకి గురైన ఆభరణాలు, నగదుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బాధితులు ఈ ఘటనపై 100 సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఉన్న ముధోల్ ఎస్ఐ బిట్ల పెర్సిస్ సంఘటన స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు తెలియజేశారు. సంఘటన స్థలంలో వేలిముద్రల సేకరణ కోసం నిర్మల్ పోలీస్ క్లూస్ టీం వారికి సమాచారం అందించారు.



## కుల బహిష్కరణపై విచారణ చేపట్టాలి

వాంకిడి, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
వాంకిడి మండలంలోని బెం దర గ్రామంలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచ ర్‌పై జరిగిన కుల వివక్షతపై , ఆసిఫాబాద్ మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో జరిగిన కుల బహిష్కరణపై అధికారులు వెంటనే స్పందించి బాధితులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు, భారతీయ బోదమసభ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ , బంజారా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపాల్ నాయక్ మాట్లాడుతూ ఈ సంఘటనలు జరిగి దాదా పు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ గ్రామంలో సాధారణ వాతావరణం నెలకొనలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వివక్షతకు గురై న గ్రామాలలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టానికి సంబంధించిన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలని అదేవిధంగా సహపంక్తి భోజనాలను ప్రభుత్వం తరఫునుంచి నిర్వహించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నిక లు వచ్చిన వేళ ఇలాంటి కుల వివక్షత పై అధికారులు చర్యలు తీసుకోకుంటే గొడవలు జరిగే పరిస్థితి ఉంటుందన్నారు. గ్రామాలలో అధికారులు వెళ్లి ఈ వివక్షత పట్ల గురైన వారికి ధైర్యం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అదేవిధంగా వివక్షతకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఆర్యిబ మాజీ అధ్యక్షులు శ్యామ్ రావు డోంగ్రె, వాంకిడి మండల అంబేత్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే , కోశాధికారి నాగ సేన్ ఉప్రే తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి సరఫరా చేసిన

## వ్యక్తిపై కేసు నమోదు



బోథ్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)
గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బోథ్ మండలంలోని డెమ్మీ గ్రామానికి చెందిన సాబ్లే ఈశ్వర్ సింగ్ అనే వ్యక్తి గంజాయి తరలిస్తూ పట్టుబడగా అతని వద్ద 500 గ్రాముల గంజాయి లభ్యమైందని దీని విలువ 12 వేల రూపాయలు ఉంటుందన్నారు. అతని నుంచి గంజాయిని, సెల్ ఫోన్ ను, మోటార్ సైకిల్ ను స్వాధీనం పరుచుకుని కేసు నమోదు చేసి అతనిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. అంతేకాకుండా ఎవరైనా గంజాయి పండించినా, తరలించినా వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు.

**గుడుంబా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు..**
బజార్‌హత్నూర్ మండలంలోని భూతాయి (బి) గ్రామంలో ముర్కుటే మారుతి, ముర్కుటే యోగేష్ అను వ్యక్తులు గుడుంబా తయారు చేస్తుండటంతో వారిపై కేసు నమోదు చేశామని సోమవారం బజార్‌హత్నూర్ ఎస్ఐ సంజయ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గుడుంబా తయారు చేస్తున్న వారి వద్ద నుండి 12 లీటర్ల గుడుంబా స్వాధీన పరుచు కొని 50 కిలోల ఇప్పపువ్వును సంఘటన స్థలంలోనే ధ్వంసం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



ఇలపై ఇంద్రధనుస్సు..

# మది నిండుగ.. పూల పండగ

గంగమ్మ ఒడికి గౌరమ్మ..!













## అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

## ఆడిపాడిన మహిళలు - మురిసిన నింగీనేల

నేలంతా పూల సింగిడైంది. వాడలన్నీ బతుకమ్మల బారులు తీరాయి. ఊళ్లన్నీ కొత్త కళను సంతరించుకున్నాయి. ఆడబిడ్డ చేతులు తాకి పూలన్నీ పులకించగా, తీరొక్క పూలతో ముస్తాబైన బతుకమ్మలు సోమవారం మధ్యాహ్నానికే దేవుడి గదిలో కొలువు దీరాయి. సాయంత్రం ఊరి మధ్యలో ప్రత్యేక ఏర్పాట్లు జరిగిన మైదానాలకు బతుకమ్మలను తీసుకెళ్లి సమూహంగా చేర్చారు. మహిళలంతా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ "ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మా..", "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.." అంటూ లయబద్ధంగా కోలాటాలు ఆడారు. తెలంగాణ బతుకు చిత్రం, పూర్తిగా గ్రామీణ వాతావరణంతో సమ్మిళితమైన బతుకమ్మ గొప్పతనాన్ని పాట, ఆట రూపంలో కీర్తించారు. పూజలందుకున్న బతుకమ్మలు చెంతకు చేరగానే చెరువు గట్లు పరవశించాయి. "పోయిరా గౌరమ్మా.. పోయిరావమ్మా.. ఇంటి సౌభాగ్యాన్ని కాపాడవమ్మా.. మల్లచ్చే ఏడాదికి మళ్లీ రావమ్మా.." అంటూ మహిళలంతా నిమజ్జనం చేశారు. గౌరమ్మను గంగమ్మ చెంతకు చేర్చడంతో తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ జరుపుకున్నారు. ఇదిలా ఉంటే కొన్ని గ్రామాల్లో మంగళవారం బతుకమ్మ జరుపుకు నేందుకు ఏర్పాట్లు చేశారు.



















# కరివేపాకు తింటే ఎంతో ఆరోగ్యం

» జుట్టు రాలడానికి ఇది అద్భుత నివారణ

కరివేపాకు, సుగంధభరితమైన ఆకుకూర, భారతీయ వంటకాలలో ఒక ముఖ్యమైన పదార్థం. ఇది ఆహారానికి రుచిని ఇవ్వడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంది. కరివేపాకులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. కరివేపాకు నీటిని ఖాళీ కడుపుతో తాగడం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి..

**జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది :**
ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కరివేపాకులో జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపించే గుణాలు ఉన్నాయి. ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. మలబద్ధకం, వికారం, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. కరివేపాకులో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది మలబద్ధకాన్ని నివారించడానికి , ప్రేగు కదలికలను మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

**శరీరాన్ని డీటాక్సిఫై చేస్తుంది :**
కరివేపాకు నీరు సహజమైన డీటాక్సిఫైయర్‌గా పనిచేస్తుంది. ఇది శరీరంలోని టాక్సిన్స్‌ను తొలగించడానికి సహాయపడుతుంది , రక్తాన్ని శుద్ధి చేస్తుంది. కరివేపాకులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, కణాలను నష్టం నుండి రక్షించడానికి సహాయపడతాయి. శరీరాన్ని డీటాక్సిఫై చేయడం వల్ల చర్మం ఆరోగ్యం మెరుగుపడుతుంది, రోగనిరోధక శక్తి పెరుగుతుంది మొత్తం ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది :**
కరివేపాకు నీరు జుట్టు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇది జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి, జుట్టు రాలడాన్ని తగ్గించడానికి, జుట్టును బలంగా , ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. కరివేపాకులో జుట్టు పెరుగుదలకు అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది జుట్టు కుదుళ్లను బలపరుస్తుంది, జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. కరివేపాకు నీరు తెల్ల జుట్టును నివారించడానికి కూడా సహాయపడుతుంది.



## మద్యం షాపులకు ఆదిలాబాద్‌లో ఒకటి, ఇచ్చోడలో రెండు షాపులకు టెండర్లు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మద్యం షాపుల టెండర్లకు సోమవారం బోణీ అయ్యింది. ఈనెల 26న ప్రక్రియ ప్రారంభం కాగా ఆదివారం వరకు దరఖాస్తుదారులు మంచి ముహూర్తం కోసం ఎదురుచూస్తూ టెండర్లు వేయలేదు. కాగా సోమవారం జిల్లాలో మూడు దరఖాస్తులు వచ్చాయి. ఆదిలాబాద్ పట్టణంలో ఒకటి, బోథ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి ఇచ్చోడలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెం డెంట్ హిమశ్రీ తెలిపారు. దరఖాస్తుల స్వీకర ణకు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెం డెంట్ కార్యాలయంలో నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గం టల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించను న్నారు. దర ఖాస్తులకు అక్టోబర్ 18 వరకు గడువు ఉంది. 23న జిల్లా కేంద్రంలో లక్కీడ్రా తీయను న్నారు. జిల్లాలో 40 షాపులు ఉండగా, 15 షాపులకు రిజర్వేషన్లు ఉన్నాయి. వీటిలో గౌడ్స్కు ఒక షాపు, ఎస్సీలకు 5, ఎస్టీలకు 9 షాపులు కేటాయించారు. టెండర్లు దక్కించు కున్న వారు డిసెంబర్ నుంచి షాపుల నిర్వ హణ చేపట్టేం దుకు అవకాశం కల్పించారు. రెండేళ్ల వరకు కాలపరిమితి ఉంటుంది. దర ఖాస్తులను స్వీకరించిన వారిలో ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ విజేందర్, బోథ్, ఉట్నూర్ ఎక్సైజ్ సీఐలు రూప్సింగ్, జుల్ఫేఖార్ అహ్మద్ పాటు ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణిలో అందించే అర్జీలను సత్వరం పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివి ధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజే స్తూ సమస్యల పరిష్కారానికి శ్రద్ధ వహించాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, కలెక్టరేట్ ఏవో వర్ణ, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు పాల్గొన్నారు.

### మత విద్వేషాలు రెచ్చగొట్టేలా
## పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పో స్టులు పెట్టిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసిన ట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్ గూడకు చెందిన అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి మత విద్వే షాలు రెచ్చగొడుతూ పోలీసుల పాత వీడియోలను సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఆ వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ స్వా ధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా వాట్సప్ గ్రూ పుల్లో విద్వేశాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## పవర్ ప్లాంటులో ప్రమాదం

### గేటు మీదపడి సీఐఎస్‌ఎఫ్ ఏఎస్సై మృతి
### మూసివేస్తుండగా ప్రమాదవశాత్తు ఊడిన వైనం

**జైపూర్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
పండుగపూట పవర్ ప్లాంటులో విషాదం నెలకొంది. రాత్రి విధులకు హాజరైన సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ గార్డుకు అదే చివరి డ్యూటీ అయింది. ఊహించని విధంగా గేటురూపంలో మృ త్యువు కబళించింది. గేటు మూసివేస్తున్న క్రమంలో ఊడి పోయి మీద పడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కొచ్చెర్లకు చెందిన నరహరిశెట్టి అర్జున సారథి(56) జై పూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు (ఎస్టీపీపీ)లో సీఐ ఎస్ఎఫ్ సెక్యూరిటీ విభాగంలో ఏఎస్సైగా పని చేస్తున్నారు.



విధుల్లో భాగంగా ఆదివారం రాత్రి డ్యూటీకి వచ్చిన ఆయన ఎస్టీపీపీ అడ్మిన్ భవనం ప్రధాన గేటు వద్ద రాత్రి విధులు నిర్వర్తిస్తున్నారు. సో మవారం తెల్లవారుజామున 4గంట ప్రాంతంలో వీల్స్ గేటు మూసి వేస్తున్న క్రమంలో ఊడిపోయి ప్ర మాదవశాత్తు అతడిపై పడింది. కిందనలిగిపోయిన అర్జున సారథిని తోటి సిబ్బంది గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్ప త్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లుగా వై ద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రిలో మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ డీఐజీ, ఐపీఎస్ డాక్టర్ ఎంజీ. రాఘవేం ద్రకుమార్, ఎస్టీపీపీ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ పరిశీలించారు. మృతుడికి భార్య గంగాభవాని, కుమారుడు రాజసింహాదత్తు, కూతురు తేజ సాయిశ్రీ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఏటీవోగా శశిధర్ బాధ్యతల స్వీకరణ

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**



జిల్లా ట్రెజరీ శాఖలో అసి స్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ (ఏటీఓ)గా శశిధర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీక రించారు. ఇది వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన ఆయన ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో ప్రభుత్వ కొలు వు సాధించారు. ఆయనకు స్థానికంగానే పోస్టింగ్ ఇస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేయగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

## హత్యాయత్నం కేసులో ఐదేళ్లు జైలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ నిజామాబాద్ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి సాయి సుధా తీర్పునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా భుక్తాపూర్‌కు చెందిన షకీల్ తాగుడుగు బానిసై నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో సంచరించేవాడు. 18 అక్టోబర్ 2021న నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఎస్ఎల్ఎస్ వైన్స్ వద్ద మద్యం తాగి గొడవ చేస్తుం డగా, షేక్ జలీల్ అనే వ్యక్తి గొడవ చేయొద్దంటూ షకీల్‌ను బెదిరించాడు. తర్వాత రోజు కత్తితో వైన్స్ వద్దకు వచ్చిన షకీల్ జలీల్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వైన్స్‌లో పనిచేసే రమేశ్, సర్ఫరోజ్ ఖాన్ జలీలు నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి షకీల్‌ను జైలుకు పంపారు. పోలీసుల తరపున డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మినర్సయ్య వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

## ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి

**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆటో డ్రైవర్ అనుమానాస్ప మృతిచెందాడు. స్థానిక ఎస్సై ఉపేందర్రావు తెలిపిన వివరాల ప్రకారం.. నస్పూర్ షిర్కే కాలనీకి చెందిన పూదరి సతీష్ (40) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్య నుంచి విడాకులు కావడంతో ఒంటరిగా ఉంటున్నాడు. సతీష్ ఇంటి పొరుగు వారైన పన్యాల బంగారితో పార్కింగ్ విషయంలో గత నాలుగు నెలల క్రితం వివాదాలు తలెత్తాయి. ఈ నెల 28న సాయంత్రం మరోసారి పార్కింగ్ విషయంలో గొడవ జరిగింది. బంగారి భార్య లక్ష్మి, చిన్న కూతురు సతీష్ ఇంట్లోకి చొరబడి అతడిని కొట్టారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి సతీష్‌ను సుత్తితో కడుపులో కొట్టాడు. సోమవారం సతీష్ అక్క పోగుల స్వప్న ఇంటికి వెళ్లి చూసే సరికి గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి అక్క పోగుల స్వప్న ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌లో చోటుచేసు కుంది. పింప్లేమంగళ భర్త వేధింపులు తాళలేక అఘా యిత్యానికి పాల్పడింది. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లాకేం ద్రంలోని రిమ్స్కు తరలించారు. పరిస్థితి విషమం గా ఉండడంతో సోమవారం హైదరాబాద్ కు రిఫర్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.




- జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు మోగిన నగారా
- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- 2విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్
- 3విడతల్లో సర్పంచ్, వార్డు మెంబర్లకు ఎన్నికలు
- అక్టోబర్ 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల..
- రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
- పల్లెల్లో మొదలైన సందడి..
- దసరా, దీపావళి పండుగలకు ప్రాధాన్యం
- మహిళలు, యువతను ఆకర్షించేందుకు ఎత్తులు

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

స్థానిక సంస్థలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. పండుగ వేళ ఎన్నిక షెడ్యూల్ రావడంతో ఏర్పాట్లలో అధికారులు తలమునకలవుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను రెండు విడతల్లో, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. మరో వైపు ప్రధాన పార్టీలు పోటీకి రంగంలో దించేందుకు బలమైన అభ్యర్థుల వేటలో పడ్డారు. ఎన్నికల్లో సత్తాచాటుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తుండగా, దీటుగా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు సిద్ధమవుతున్నారు. కీలకమైన జెడ్పీటీసీ పీఠాలను దక్కించుకునేందుకు ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు దృష్టిసారిస్తున్నారు. మొత్తం షెడ్యూల్ ప్రకటనతో గ్రామాల్లో ఎన్నికల పండుగ మొదలైంది.

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) సిద్ధమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో ఇచ్చిన మరుసటి రోజే అన్ని జిల్లాల రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేసి రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. అదే రోజు రిజర్వేషన్లపై కొందరు కోర్టుకు వెళ్లారు. అసెంబ్లీలో చేసిన తీర్మానం గవర్నర్ దగ్గర పెండింగ్ ఉండగానే, రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇవ్వడం ఏంటని కోర్టు ప్రశ్నించింది. పది రోజులపాటు నోటిఫికేషన్ ఇవ్వకూడదని ఆదేశించింది. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం లీగల్ ఒపీనియన్ తీసుకొని స్థానిక సంస్థల ఎన్నికలపై ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. ముందుగా రెండు విడుతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, మూడు విడుతల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. అక్టోబర్ 9వ తేదీ ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయనుండగా.. అదే రోజు నామినేషన్ల స్వీకరణ మొదలుకానున్నది. అక్టోబర్ 23వ తేదీన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు తొలి విడుత, అదే నెల 27న రెండో విడుతలో పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 17వ తేదీన తొలి విడుత సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేనున్నారు. అక్టోబర్ 31వ తేదీ సర్పంచ్ ఎన్నికలకు తొలి విడుత పోలింగ్ ఉంటుంది. అక్టోబర్ 21 నుంచి రెండో విడుత సర్పంచ్ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 4న రెండో విడుత పోలింగ్, అక్టోబర్ 25న మూడో విడుత నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 8వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. సర్పంచ్ ఎన్నికలు ముగిసిన అనంతరం నవంబర్ 11వ తేదీన ఎంటీపీసీ, జడ్పీటీసీ ఫలితాలు వెల్లడించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది.

**సిద్ధమైన అధికార యంత్రాంగం...**

ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు. మంచిర్యాల జిల్లాలో 16 జడ్పీటీసీ, 129 ఎంపీటీసీ, 306 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు 3,394 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ ఎన్నికలకు 2,680, పరిషత్ ఎన్నికలను 714 కేంద్రాల్లో నిర్వహించనుండగా 3,76,669 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 20 జడ్పీటీసీ, 168 ఎంపీటీసీ, 473 సర్పంచ్ స్థానాల్లో 4,47,135 మంది ఓటర్లు, ఆసిఫాబాద్ జిల్లాలో 15 జడ్పీటీసీ, 127 ఎంపీటీసీ, 334 సర్పంచ్ స్థానాల్లో 3,53,904 మంది ఓటర్లు, నిర్మల్ జిల్లాలో 18 జడ్పీటీసీ, 157 ఎంపీటీసీ, 400 సర్పంచ్ స్థానాల్లో 4,49,302 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఓటు వేసేందుకు వేల సంఖ్యలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు అధికారులకు కొన్ని జిల్లాల్లో శిక్షణ పూర్తికాగా, కొన్ని జిల్లాల్లో శిక్షణ కొనసాగుతున్నది. పోలింగ్ సామగ్రి కోసం గతంలోనే టెండర్లు పిలిచిన అధికారులు, పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే ఆ సామగ్రిని చేరవేశారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**గ్రామాల్లో మొదలైన సందడి...**

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల పండుగ మొదలైంది. ఎన్నికల్లో పోటీ చే సేందుకు సిద్ధమైన ఆశావహులు, రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన గ్రామాల్లో ఇప్పటికే ఓటర్లను ప్ర సన్నం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. సద్దుల బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలను దృష్టిలో ఉంచుకొని మహిళలు, యువతను ఆకర్షించేందుకు ఎత్తులు వేస్తున్నారు. దసరా పండుగ అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజున వస్తుండడంతో దానికి ఒక్క రోజు ముందు లేదా మరుసటి రోజు మద్యం, మాంసం పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. వార్డులు, వాడకట్లలో ఇప్పటికే ఈ మేరకు సంప్రదింపులు జరుపుతున్నారు. వారికి ఎప్పుడు కావాలంటే అప్పుడు మేకలు, గొర్రెలతో పాటు మద్యం పంపిణీ చేస్తామంటూ అభ్యర్థులు హామీలు ఇస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఈసారి పండుగలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సద్దుల బతుకమ్మ కోసం ఇప్పటికే డీజేలు ఏర్పాటు చేయడం, సొంత ఖర్చులతో లైటింగ్, బతుకమ్మ ఘాట్ల సుందరీకరణకు చాలా మంది ముందుకొచ్చారు. దీంతో ఎన్నికల హడావుడి గ్రామాల్లో మొదలైపోయింది. ఓ వైపు రిజర్వేషన్లపై అక్టోబర్ 8వ తేదీన కోర్టు హియరింగ్ ఉన్న నేపథ్యంలో ఎన్నికలపై ఇంకా సందిగ్ధత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ఆశావహులు మాత్రం తగ్గేదేలే అంటూ ఎన్నికలకు కాలు దువ్వుతున్నారు. మొత్తానికి పల్లెల్లో ఎన్నికల సందండి నెలకొంది.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒకరు అరెస్ట్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి కథనం ప్రకారం.. మావల గ్రామానికి చెందిన ఏరా నడిపి గంగన్న, ఏరా లక్ష్మీలు ఆరేళ్ల కిందట వారి లావాణి భూములను అదే గ్రామానికి చెందిన ఉష్కం రఘుపతి దగ్గర తాకట్టు పెట్టి ఒక్కొక్కరూ రూ.18 లక్షలు అప్పుగా తీసుకున్నారు. తీసుకున్న అప్పు డబ్బులు ప్రస్తుతం చెల్లిస్తామని భూమిని తిరిగి అప్పగిం చాలని కోరగా భూమిని ఇవ్వకుండా రఘుపతి కులం పేరుతో దూషించారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు రఘుపతిని సోమవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు డీస్పీ తెలిపారు.

## ప్రతీ ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసులపై నమ్మకం మరింతగా పెరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజాఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీకి విన్నవించారు. సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. సుదూర ప్రాంతాల ప్రజలు తమ ఫిర్యాదులను 87126 59973 నంబర్కు వాట్సాప్ ద్వారా కూడా తెలియజేయవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 56 మంది అర్జీదారులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, భార్యభర్తల విభేదాలు, పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీసీ కొండ రాజు, విభాగ అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి ఇన్నోవేటివ్ టీచర్ అవార్డుకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంపిక

**కాసిపేట, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ రాష్ట్ర స్థాయి ఇన్నోవేటివ్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. జటాధర ఎడ్యూకేషన్ టెక్నాలజీస్(జేఈటీ) ప్రతిష్టాత్మక జెట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డుకు ఎంపిక కాగా సోమవారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో అవార్డు స్వీకరించారు. గత 12 ఏళ్ల నుంచి బోధనతో పాటు విద్యార్థుల అభివృద్ధికి చేసిన కృషికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిని అవార్డుతో పాటు నగదు ప్రోత్సాహంతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ వింగ్ కమాండర్ అనీష్ ఆంటోనీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు రావడం ఆనందంగా ఉందని, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తోడ్పాటు మరువలేనిదని అన్నారు. ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వచ్చినందున నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు, బందోబస్తు, అధికారులు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, రక్షణ ఏర్పాట్లు ఇతర ఎన్నికల అంశాలకు సంబంధించి అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే ప్రచార అంశాలను వెంటనే తొలగించాలని, మీడియాలో వచ్చే ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జెడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి. ఎన్నికలు ప్రతి జిల్లాలో రెండు విడతలలో నిర్వహించడం జరుగుతుందని, సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు ఎంపిక చేయబడిన జిల్లాలలో మూడు విడతలుగా, మిగతా జిల్లాలలో రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశం లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా , జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.







# బాసరలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

**మహాగౌరి అవతారంలో సరస్వతీ అమ్మవారి దర్శనం**
**అమ్మవారి సన్నిధిలో కలెక్టర్ దంపతుల పూజలు**
**2123మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు**
**భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారుల ఏర్పాట్లు**

**ముథోల్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి క్షేత్రంలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభ వంగా కొనసాగుతున్నయి. ఎనిమిదవ రోజు అమ్మవారు మహాగౌరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం మంగళ వాయిద్య సేవ, గణపతి పూజ, పుణ్యావాచనం, గౌరినామార్చన వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి అమ్మవారికి చక్కెర పొంగలి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున 3 గంటల నుండి ఆలయ సన్నిధిలోని సాధారణ, ప్రత్యేక అక్షరాభ్యాస మండపలలో ఆలయ అర్చకులు చిన్నారుల కు వేద మంత్రోచ్చారనాతో అక్షర స్వీకార పూజను ఘనంగా నిర్వహిస్తున్నారు.అమ్మవారి దర్శనానికి తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ క్యూలైన్లలో భక్తుల కు, చిన్నారులకు, పాలు, బిస్కెట్లు, అరటిపళ్లను నీళ్ల బాటిల్లను పంపిణీ చేశారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు.

**కలెక్టర్ దంపతుల పూజలు..**

దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్ కలెక్టర్ దంపతులు అభిలాష అభినవ్ చే ప్రత్యేక కు కుమార్చన పూజ జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు.

**తెల్లవారుజామున అక్షర శ్రీకర పూజలు..**

మూలా నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటల నుండి ఆలయంలోని సాధారణ ప్రత్యేక మండపాలలో ఆలయ అర్చకులు అక్షర స్వీకార పూజలు ప్రారంభించారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉండడంతో మధ్యాహ్నం 11గంటలకు అక్షరాభ్యాస కార్యక్రమాలు పూర్తయ్యాయి.

**ఘనంగా మూల నక్షత్ర సరస్వతీ పూజ...**

అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆలయ వేద పండితులు అర్చకులు వేద మంత్రో చ్చారణలతో విశేష మూల నక్షత్ర సరస్వతి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న వారికి ఆలయం తరఫున తీర్థ ప్రసాద వితరణ చేశారు.

**గోదావరి నది వద్ద పుణ్యా స్నానాలకు అనుమతి నిరాకరణ**

గోదావరి నది ఉదృతంగా ప్రవహిస్తుండడంతో గోదావరి నది ఘాట్లలో భక్తులకు పుణ్యా స్నానాలకు పోలీసులు అనుమతించడం లేదు. గోదావరి బ్రిడ్జి వద్ద భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

**2123 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు..**

అమ్మవారి సన్నిధిలో మూల నక్షత్రం సందర్భంగా ఆలయంలోని సాధారణ ప్రత్యేక మండపాలలో ఆలయ అర్చకులు 2123 మంది చిన్నారులకు అక్షయ శ్రీకర పూజలు నిర్వహించారు. ఆర్జిత సేవలు ప్రసాదాల అమ్మకాల ద్వారా ఆలయానికి 25 లక్షల 65 వేల ఒక వంద రూపాయల ఆదాయంను సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సుమారు ముప్పై వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**బాసరకు తగ్గిన భక్తుల రద్దీ...**

బాసర పుణ్యక్షేత్రానికి మూల నక్షత్రం సందర్భంగా సోమవారం వరద పోటు భయంతో భక్తులకు సంఖ్య గణనీయంగా తగ్గింది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అక్షరాభ్యాస పూజలతో పాటు ఆదాయం కూడా తగ్గినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధానంగా గోదావరి నది ఉగ్రరూపం దాల్చి ప్రవహించడం, ఆలయం నుండి గోదావరి నదికి వెళ్ళు మార్గం వరద నీటితో మునిగిపోవడం, గోదావరి నది పుణ్య స్నానాలకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం తో భక్తుల రాక తగ్గింది. దీనికి తోడు వ్యాపారస్తులకు వ్యాపారం మందకోడిగా సాగినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో ముథోల్ సిఐ మల్లేష్ ,బాసర ఎస్సై శ్రీనివాస్, పోలీసు సిబ్బంది భారీగా బందోబస్తు నిర్వహించారు.

**50వేల మంది భక్తులకు అన్నదానం...**

8 రోజులపాటు నాందేడ్‌కు చెందిన గడిపూర మహారాజ్ దేవస్థానం ఆధ్వర్యంలో ఎనిమిది రోజులలో సుమారు 50 వేల మంది వరకు ఉచిత అన్నదాన ప్రసాదం స్వీకరించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...**

దేవీ నవరాత్రులు పురస్కరించుకొని భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆలరిస్తున్నాయి. శ్రీశివదుర్గ కూచిపూడి నృత్య కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నయి.

**అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు...**

దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్‌తో ప్రత్యేక కుంకుమార్చన పూజ జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. ఎమ్మెల్యేను సన్మానించి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

# మహారాష్ట్రకు తాకిన ఆదివాసీ ఉద్యమం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)** లంబాడిలకు వ్యతిరేకంగా సాగుతున్న ఆదివాసుల ఉద్యమం మహారాష్ట్రకు తాకింది. సోమవారం మహారాష్ట్రలోని పండర్‌కౌడ పట్టణంలో ఆదివాసులు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ, తెలంగాణ రాజ గోండ్ సేవాసమితి అధ్యక్షులు సోయం బాపూరావు ర్యాలీలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహారాష్ట్రలో బిసిలుగా చెలామణి అవుతున్న లంబాడిలు తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చెయ్యడంతో వారిని ఎస్టీ జాబితాలో చేర్చొద్దని ఆదివాసీ కృతి సమాజ్ ఆందోళనలకు శ్రీకారం చుట్టింది.అందులో భాగంగానే పండర్ కౌడలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక స్టేడియం నుండి మొదలైన ర్యాలీ పట్టణంలోని పుర విధుల గుండా నినాదాలు డోలు వాయిద్యాలతో సాగింది.లంబాడి లను ఎట్టి పరిస్థితిలో ఎస్టీలో చేర్చొద్దని నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. బిర్సా ముండా, అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా సోయం బాపూరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో దొంగ దారి న ఎస్టీలుగా చెలామణి అవుతు లంబాడాలు ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారని, అలాగే మహారాష్ట్రలో సైతం అలాగే చేద్దాం అని చూస్తున్నారని దీన్ని ఎట్టి పరిస్థితి లో కానివ్వం అన్నారు. అవసరం అయితే తెలంగాణ రాష్టం నుంచి ఆదివాసులు తరలి వచ్చేందుకు తాను కృషి చేస్తానన్నారు.తెలంగాణ రాష్టం నుంచే లంబాడిలను తరమి కొట్టెందుకు సిద్ధం అవుతుంటే మహారాష్ట్రలో వారు తమ ఉనికిని చాటే ప్ర యత్నం చేస్తున్నారన్నారు. భద్రాచలంలో లంబాడిలను ఎస్టీల నుంచి తొలగించాలని 50వేల మందితో భారీ సభను నిర్వహించడం జరిగిందన్నారు. ఆదివాసీ సమా జం చైతన్య వంతులై లంబాడిలను ఎదురుకోవాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో సైతం కుట్రలు పన్నుతున్నరన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క ఆదివాసీలు ఏకం కావాలన్నారు.సుప్రీం కోర్టు మనకు అండగా ఉంటుందని ఏఒక్క ఆదివాసీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ర్యాలీలో మహారాష్ట్ర రాష్ట్ర మాజీ విద్య శాఖ మంత్రి వసంత్ రావు పూర్కే,బావురావు మార్కె, తెలంగాణ రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సేద్మకి ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.







విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
• ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి •
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# శాంతించని గోదావరి

**మంచిర్యాల, సెప్టెంబర్ 29 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల గోదావరి శాంతించడం లేదు. ఎగువ ప్రాంతం నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతుండగా, ఏడు లక్షల క్యూసెక్కులకుపైగా గోదావరిలోకి వరద వదులుతున్నారు. సోమవారం అర్ధ రాత్రి ఒంటిగంటకు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శ్రీరాంసాగర్ నుంచి 450000 క్యూసెక్కులు, కడెంప్రాజెక్టు నుంచి 4 వేల క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ద్వారా 262209 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టుకు ఉన్న 62 గేట్లలో 43 గేట్లు ఎత్తి 697202 క్యూసెక్కుల నీటిని గోదావరి నదిలోకి వదిలారు. ఉదయం 3 గంటలకు 751964 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 727159 క్యూసెక్కులు, ఉదయం 6 గంటలకు 744482 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 731670 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. ఉదయం 9 గంటలకు 747531 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండగా, 43 గేట్లు ఎత్తి 734746 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. మధ్యాహ్నం 12 గంటలకు 658791 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 701932 క్యూసెక్కులు, మధ్యాహ్నం మూడు గంటలకు 648084 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 691225 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. గోదావరి తీరాన ఉన్న గౌతమేశ్వర ఆలయం ముందు వరకు నీరు వచ్చి చేరింది. రాళ్లవాగు ప్రవాహం గోదావరిలో కలిసే చోట వెనక్కి తంతుండడంతో పక్కనే ఉన్న ఎన్టీఆర్‌నగర్, రాంనగర్ ఏరియాల్లోని రోడ్ల పైకి వరద వచ్చి చేరింది. ఎన్టీఆర్‌నగర్‌లో కొన్ని ఇండ్ల మధ్యకు నీరు వచ్చింది. పంటలు నీట మునిగాయి. పత్తి, వరి, మిర్చి పంటలు నీటిలోనే ఉండిపోయాయి.

